RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

**లిక్కర్ స్కామ్‌లో కీలక పరిణామం** 2

నిందితుల ఆస్తులు అటాచ్ చేసిన ఇడి



| నిజామాబాద్ Nizamabad | సంపుటి : 03 Vol: 03 | సంచిక : 49 Vol: 49 | మార్చి 07 శనివారం 2026 March 07 Saturday 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి Editor : rachamallu madhavi | పేజీలు 08 Pages 08 | వెల : రూ. 6.00 Cost: Rs |
|---|---|---|---|---|---|---|



## ఛత్తీస్‌గఢ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- ఛత్తీస్‌గఢ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం
- ప్రైవేట్ బస్సు బోల్తా పడి ఐదుగురు మృతి

**రాయ్‌పూర్ జన సంఘర్షణ**

ఛత్తీస్‌గఢ్‌లోని జాష్‌పూర్ జిల్లాలో శుక్రవారం తెల్లవారుజామున ఒక ప్రైవేట్ బస్సు ప్రమాదానికి గురైంది. గమ్యస్థానానికి చేరువలో ఉండగా బస్సు అదుపుతప్పి బోల్తా పడటంతో ఐదుగురు ప్రయాణికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. తప్కరా పోలీస్ స్టేషన్ పరిధిలోని గోడాంబ గ్రామం సమీపంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. జార్ఖండ్‌లోని కుర్దేగ్ నుండి ఛత్తీస్‌గఢ్‌లోని కుంకురి పట్టణానికి వెళ్తున్న సమయంలో డ్రైవర్

➤ మిగతా 2వ పేజిలో..

## ప్రజాపాలన పేరిట కాంగ్రెస్ కొత్త నాటకం

పది వారాల ప్రణాళికపై హరీశ్ రావు నిప్పులు




## సివిల్స్‌లో తెలుగు విద్యార్థుల సత్తా

### ఫలితాలు విడుదల: దేశవ్యాప్తంగా సత్తా చాటిన అభ్యర్థులు.. అనూజ్ అగ్నిహోత్రికి మొదటి ర్యాంక్

**న్యూఢిల్లీ జన సంఘర్షణ** : దేశంలోనే అత్యున్నత సర్వీసులైన ఐఏఎస్, ఐపీఎస్ వంటి పోస్టుల భర్తీకి సంబంధించి నిర్వహించిన సివిల్ సర్వీసెస్ పరీక్షా ఫలితాలను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఖూాజ) శుక్రవారం ప్రకటించింది. ఈ ఏడాది ఫలితాల్లో అనూజ్ అగ్నిహోత్రి ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్‌తో అగ్రస్థానంలో నిలవగా, రాజేశ్వరి సువే రెండో స్థానాన్ని, ఆకాన్ష్ ధుల్ మూడో ర్యాంక్‌ను దక్కించుకున్నారు. రాఘవ్ ఝున్‌ఝున్‌వాలా నాలుగో స్థానాన్ని కైవసం చేసుకున్నారు.

తెలుగు అభ్యర్థుల మెరుపులు:

ఈ ఫలితాల్లో తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు తమ ప్రతిభను చాటారు. సృజన (55వ ర్యాంక్) అత్యుత్తమ ప్రదర్శన కనబరచగా.. డీఎస్‌కే ప్రచేత్ (193), ఎస్. వర్షిత్ రెడ్డి (259), ఎం. పవన్ కుమార్ రెడ్డి (297), వి. విక్రమసింహారెడ్డి (541), గుమ్మల శ్వేత (573), పోతుపురెడ్డి భార్గవ్ (537) వంటి వారు మంచి ర్యాంకులతో మెరిశారు. అలాగే పుదారి రాహుల్, కత్తిమాని అనిరుధ్, కోరపాతుల శ్రీకర్ రాజు, ఇస్లావత్ శ్రీరామ్ హర్ష, కట్టా ప్రత్యూష, గోగుల రాజశేఖర్, గుగులోతు జితేందర్ నాయక్ కూడా విజేతల జాబితాలో నిలిచారు.

నియామకాల వివరాలు:

మొత్తం 1087 మంది అభ్యర్థులు ఈ ఏడాది తుది జాబితాకు ఎంపికయ్యారు.

➤ మిగతా 2వ పేజిలో..

## మాటలు, మూటలతో గెలవలేదు

### ప్రజల మద్దతుతోనే ప్రజా ప్రభుత్వం: సీఎం రేవంత్ రెడ్డి

పది వారాల ప్రణాళికపై హ

**హైదరాబాద్ జన సంఘర్షణ :**

తెలంగాణ రాష్ట్రం కేవలం ప్రజల మద్దతుతోనే మార్పును సాధించిందని, తాము అక్రమ సంపాదనతోనో లేదా ప్రలోభాలతోనో అధికారంలోకి రాలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో జరిగిన 'మాదిగ ఎంప్లాయిస్ సమన్వయ కమిటీ' సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్నది ప్రజలు కష్టపడి తెచ్చుకున్న ప్రభుత్వమని, పేదల సంక్షేమమే తమ ప్రాధాన్యత

➤ మిగతా 2వ పేజిలో..



## అమెరికా ఆస్తులే మా లక్ష్యం

### పొరుగు దేశాలకు ముప్పు లేదు

### ఇరాన్ మంత్రి సయ్యద్ ఖతీబ్జాదే

**న్యూఢిల్లీ జన సంఘర్షణ :**

పశ్చిమాసియాలో తాము చేపడుతున్న సైనిక చర్యలు కేవలం అమెరికా ఆస్తులను లక్ష్యంగా చేసుకునే జరుగుతున్నాయని ఇరాన్ విదేశాంగ సహాయ మంత్రి సయ్యద్ ఖతీబ్జాదే స్పష్టం చేశారు. ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, ఇరాన్ దాడుల వల్ల పొరుగున ఉన్న అరబ్ దేశాల్లో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని వెల్లడించారు. తమ పోరాటం కేవలం అమెరికా బలగాలు, వారి వనరులపైనేనని ఆయన సమర్థించుకున్నారు. తన ఢిల్లీ పర్యటనలో భాగంగా భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌తో ఖతీబ్జాదే భేటీ అయ్యారు. ఇటీవల హిందూ మహాసముద్రంలో ఇరాన్ యుద్ధనౌక 'ఐరిస్ దేనా-75'ను అమెరికా ధ్వంసం చేయడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. భారత స్నేహితుల ఆహ్వానం మేరకు వచ్చిన ఆ నౌకపై అమెరికా దాడి చేయడం

➤ మిగతా 2వ పేజిలో..

## ఇరాన్ బేషరతుగా లొంగిపోవాల్సిందే

### ఒప్పందాల ప్రసక్తే లేదు: ట్రంప్ సంచలన ప్రకటన

**వాషింగ్టన్ జన సంఘర్షణ :**

ఇరాన్‌తో కొనసాగుతున్న ఉద్రిక్తతల వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో ఎలాంటి చర్చలు లేదా ఒప్పందాలు (డీల్) ఉండబోవని, ఆ దేశం బేషరతుగా లొంగిపోవాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. యుద్ధం ఏడవ రోజుకు చేరుకున్న సందర్భంగా తన సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్'లో ఆయన ఈ మేరకు పోస్ట్ చేశారు. ఇరాన్ లొంగిపోయిన తర్వాతే ఆ దేశ భవిష్యత్తు మరియు కొత్త నాయకత్వంపై నిర్ణయం ఉంటుందని, ఆ తర్వాతే మిత్రదేశాలతో కలిసి అక్కడి ఆర్థిక వ్యవస్థను పునర్నిర్మిస్తామని ట్రంప్

➤ మిగతా 2వ పేజిలో..



## మాటలు, మూటలతో గెలవలేదు

**మొదటిపేజీ తరువాయి..** అని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగ జాతి దశాబ్దాలుగా చేసిన పోరాటాన్ని రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా స్మరించుకున్నారు. "మాదిగల న్యాయమైన హక్కుల కోసం నేను మొదటి నుంచీ మద్దతుగా ఉన్నాను. సుప్రీంకోర్టు తీర్పు తర్వాత వర్గీకరణపై ప్రకటన చేసిన తొలి రాష్ట్రం తెలంగాణనే కావడం మా చిత్తశుద్ధికి నిదర్శనం" అని ఆయన అన్నారు. మిత్రధర్మానికి కట్టుబడిన కర్ణుడిలా, ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా మాదిగ పక్షాన నిలబడతానని భరోసా ఇచ్చారు. ఇప్పటికే అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపామని గుర్తు చేశారు.
గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై సీఎం తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత పాలకులు ప్రజలకు కేవలం గొర్రెలు, బర్రెలు పంపిణీ చేసి సరిపెట్టారని, వారి పిల్లలు మాత్రం రాజ్యాలు ఏలాలా అని ప్రశ్నించారు. "మనం కేవలం పశువులను కాచుకోవడానికే పరిమితం కావాలా? మన బిడ్డలకు నాణ్యమైన చదువు అవసరం లేదా?" అని నిలదీశారు. అందుకే విద్యావ్యవస్థను ప్రక్షాళన చేసేందుకే విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్నట్లు ఆయన వెల్లడించారు.
రాష్ట్రం ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని, ప్రభుత్వ వద్ద పంపిణీ చేయడానికి భూములు కూడా లేవని రేవంత్ రెడ్డి వాస్తవ పరిస్థితిని వివరించారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బ్రాండ్ అంబాసిడర్లు ఉద్యోగులేనని, ప్రగతి ప్రణాళికల అమలులో ఉద్యోగులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, నేతలు కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్య తదితరులు పాల్గొన్నారు.

## సివిల్స్‌లో తెలుగు విద్యార్థుల సత్తా

**మొదటిపేజీ తరువాయి..** ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ సహా సెంట్రల్ గ్రూప్-ఏ, గ్రూప్-బి సర్వీసుల్లో నియమితులు కానున్నారు. 2025లో ప్రిలిమ్స్, ఆపై ఆగస్టు-సెప్టెంబర్‌లో మెయిన్స్ నిర్వహించగా.. ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన ఇంటర్వ్యూల ఆధారంగా తుది ఎంపిక జరిగింది.
ముఖ్య సమాచారం:
మార్కుల వివరాలు: ఫలితాలు వెల్లడైన 15 రోజుల్లోగా అధికారిక వెబ్‌సైట్‌లో మార్కులను అందుబాటులో ఉంచుతామని యూపీఎస్సీ తెలిపింది.
సహాయ కేంద్రం: అభ్యర్థులు ఏవైనా సందేహాల కోసం 23385271, 23381125, 23098543 నంబర్లను ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటల మధ్య సంప్రదించవచ్చు.

# ఇరాన్ బేషరతుగా లొంగిపోవాల్సిందే

**మొదటిపేజీ తరువాయి..** పేర్కొన్నారు. మరోవైపు, ఇరాన్‌పై అమెరికా జరుపుతున్న దాడులను ఐరోపా దేశాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. స్పెయిన్ ప్రధాని పెడ్రో శాంచెజ్ ఈ యుద్ధాన్ని "అసాధారణ తప్పిదం"గా అభివర్ణించారు. దాడులకు సహకరించేలా స్పెయిన్ భూభాగంలోని సైనిక స్థావరాలను వినియోగించుకోవాలన్న ట్రంప్ ప్రతిపాదనను ఆయన నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. అమెరికా ధోరణి ప్రపంచ శాంతికి విఘాతమని ఆయన విమర్శించారు. యుద్ధం ఇలాగే మరికొన్ని వారాల పాటు కొనసాగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తమయ్యే ప్రమాదం ఉందని ఖతార్ ఇంధన శాఖ మంత్రి హెచ్చరించారు. ముఖ్యంగా ముడి చమురు సరఫరాకు ఆటంకం కలిగి, బ్యారెల్ ధర 150 డాలర్లకు చేరే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణానికి దారితీస్తుందని నిపుణులు భావిస్తున్నారు.

# ఛత్తీస్‌గఢ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

**మొదటిపేజీ తరువాయి..** నియంత్రణ కోల్పోవడంతో బస్సు పల్టీలు కొట్టింది. ప్రమాద సమయంలో బస్సులో మొత్తం 24 మంది ప్రయాణికులు ఉన్నట్లు జాష్‌పూర్ సీనియర్ ఎస్పీ లాల్ ఉమేద్ సింగ్ వెల్లడించారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు, రెస్క్యూ బృందాలు ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని హుటాహుటిన సమీపంలోని ఆసుపత్రులకు తరలించి మెరుగైన చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు ప్రారంభించారు.

## తిరువూరులో ఉద్రిక్తత

### 144 సెక్షన్ విధింపు

**తిరువూరు, మార్చి6** : ఎన్టీఆర్ జిల్లాతిరువూరు నియోజకవర్గంలో గత కొద్ది రోజులుగా కొనసాగుతున్న రాజకీయ ఉత్కంఠగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తిరువూరు నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై టీడీపీ, విపక్ష వైసీపీ నేతలు బహిరంగ చర్చకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలోనే ఇరు వర్గాల కీలక నేతలు 'బోసు బొమ్మ' సెంటర్‌లో చర్చకు వెళ్తున్న విషయం తెలుసుకొని పోలీసులు రంగ ప్రవేశం చేశారు. అనంతరం ఇరు వర్గాలను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కి తరలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బోస్ బొమ్మ సెంటర్ వద్ద పోలీసులు భారీగా మోహరించారు. గత రెండు రోజులుగా తిరువూరు పట్టణంలో టీడీపీ-వైసీపీ నేతల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. నేతలు సవాళ్లు, ప్రతి సవాళ్లు విసురుకుంటున్నారు. ఇరు వర్గాల నేతలకు స్థానిక తహశీల్దార్ నచ్చజెప్పాలని చూసినా వినకపోవడంతో తిరువూరు మండల వ్యాప్తంగా 144 సెక్షన్ విధించారు. ప్రజలు గుంపులుగా ఉన్నా, ఉద్రిక్తతలకు కారణమయ్యే ర్యాలీలు, సభలు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

# అమెరికా ఆస్తులే మా లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి..** అత్యంత దురదృష్టకరమని ఆయన వ్యాఖ్యానించారు. ఇజ్రాయెల్-అమెరికా దాడుల్లో ఇరాన్ అత్యున్నత నేత ఖమేనీతో పాటు పలువురు కీలక నేతలు ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో, ఇరాన్ రాజకీయ వ్యవస్థ కుప్పకూలుతుందన్న ట్రంప్ ప్రభుత్వం వాదనలను ఖతీబ్జాదే తోసిపుచ్చారు. "మా దేశ పాలన వ్యక్తులపై కాకుండా పటిష్టమైన వ్యవస్థలపై ఆధారపడి ఉంది. రాజ్యాంగబద్ధంగా ఎవరి బాధ్యతలు ఏమిటో స్పష్టంగా ఉన్నాయి. వ్యక్తులు మారినా వ్యవస్థ నిరంతరాయంగా కొనసాగుతుంది" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## ప్రజాపాలన పేరిట కాంగ్రెస్ కొత్త నాటకం:

## పది వారాల ప్రణాళికపై హరీశ్ రావు నిప్పులు

**హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక' కేవలం ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఆడుతున్న డ్రామా అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గతంలో నిర్వహించిన గ్రామసభల్లో ప్రజల నుంచి సేకరించిన లక్షలాది దరఖాస్తులు ఇప్పటికీ చెత్తబుట్టల్లోనే మగ్గుతున్నాయని, వాటికే దిక్కులేని తరుణంలో మళ్లీ పది వారాల ప్రచార ఆర్భాటం దేనికని ప్రశ్నించారు.
వైఫల్యాల నుంచి దృష్టి మళ్లించేందుకే..
దాదాపు 800 రోజుల పాలనలో సాధించిందేమీ లేక, ఇప్పుడు 99 రోజుల ప్రణాళిక పేరుతో సీఎం రేవంత్ రెడ్డి కొత్త పల్లవి అందుకున్నారని హరీశ్ రావు విమర్శించారు. ప్రభుత్వం తన పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే ఈ 'డైవర్షన్ ప్లాన్'కు తెరతీసిందని ఆరోపించారు. ఆరు గ్యారెంటీల అమలులో విఫలమై, ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకున్న తరుణంలో పత్రికల్లో పబ్లిసిటీ కోసం ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నారని మండిపడ్డారు.
రైతులు, యువతను వంచించారు:
రైతులకు అందాల్సిన రైతు భరోసా, పంట బోనస్ ఊసే లేదని, చివరకు యూరియా సరఫరా చేయడంలో కూడా ప్రభుత్వం చేతులెత్తేసిందని హరీశ్ రావు దుయ్యబట్టారు. యువతకు ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలన్న హామీ ఏమైందని నిలదీశారు. "జాబ్ క్యాలెండర్‌ను జాబ్‌లెస్ క్యాలెండర్‌గా మార్చారు. మూసీ బ్యూటిఫికేషన్ పేరుతో లూటీకి పాల్పడుతూ, నిరుద్యోగుల ఆశలను నీరుగార్చారు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిస్థితి ఏంటో చెప్పాలని డిమాండ్ చేశారు.
ప్రజలు నిలదీసేందుకు సిద్ధంగా ఉన్నారు:
సోలార్ విద్యుత్, పర్యావరణం, డ్రగ్స్ నిర్మూలన వంటి అంశాలను కేవలం ప్రకటనలకే పరిమితం చేశారని, ప్రభుత్వానికి వీటిపై కనీస చిత్తశుద్ధి లేదని హరీశ్ రావు ఎద్దేవా చేశారు. పాలనను గాలికి వదిలేసి, ప్రచార ఆర్భాటాలతో ప్రజలను ఏమార్చాలని చూస్తున్న కాంగ్రెస్ నాయకులను గ్రామ గ్రామాన ప్రజలు నిలదీసే రోజులు దగ్గరపడ్డాయని ఆయన హెచ్చరించారు.

## యుద్ధం ఇప్పుడే మొదలైంది: ఇరాన్‌కు అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ హెచ్చరిక

**వాషింగ్టన్:** ఇరాన్‌తో కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా తన దూకుడును మరింత పెంచింది. ఈ యుద్ధం నుంచి వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని, అసలైన పోరాటం ఇప్పుడే ప్రారంభమైందని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ స్పష్టం చేశారు. వాషింగ్టన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అమెరికా సైనిక పటిష్టతను ఇరాన్ పాలకులు, ఐఆర్‌జీసీ  తక్కువ అంచనా వేస్తున్నారని విమర్శించారు. అమెరికా సంకల్పం ఎంత బలమైందో త్వరలోనే అర్థమవుతుందని, తమ లక్ష్యం నెరవేరే వరకు దాడులు కొనసాగుతాయని ఆయన కుండబద్దలు కొట్టారు.
మరోవైపు, గల్ఫ్ ప్రాంతం నుండి అమెరికా నౌకాదళం ఉపసంహరణ జరుగుతోందన్న ప్రచారాన్ని యూఎస్ సెంట్రల్ కమాండ్ (జజుచీజూవీ) తీవ్రంగా ఖండించింది. ఇరాన్ నావికాదళాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసే వరకు తమ మిషన్ ఆగదని సెంట్‌కామ్ స్పష్టం చేసింది. గత 72 గంటల్లో ఇరాన్‌లోని సుమారు 200 కీలక లక్ష్యాలపై అమెరికా బాంబర్ ఫోర్స్ భీకర దాడులు చేసినట్లు వెల్లడించింది. ముఖ్యంగా బి-2 స్పిరిట్ బాంబర్ల ద్వారా కేవలం ఒక గంట వ్యవధిలోనే భారీ స్థాయి పెనెట్రేటర్ బాంబులను ప్రయోగించి, బాలిస్టిక్ మిస్సైల్ లాంచ్ ప్యాడ్‌లను ధ్వంసం చేసినట్లు అధికారులు తెలిపారు.
అవసరమైతే ఈ యుద్ధాన్ని సుదీర్ఘ కాలం పాటు కొనసాగించేందుకు కూడా తాము సిద్ధంగా ఉన్నామని హెగ్సెత్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇదే సమయంలో శరణార్థుల అంశంపై స్పందిస్తూ.. యుద్ధం కారణంగా అరబ్ దేశాల నుండి వచ్చే వారికి అమెరికాలో ఆశ్రయం కల్పించే ఆలోచన ప్రస్తుతం తమ వద్ద లేదని ఆయన తేల్చి చెప్పారు. అమెరికా తన పూర్తి శక్తి సామర్థ్యాలతో ఇప్పుడే దాడులను ముమ్మరం చేసిందని, శత్రువుల ఆట కట్టించే వరకు విశ్రమించబోమని ఆయన పునరుద్ఘాటించారు.

## లిక్కర్ స్కామ్‌లో కీలక పరిణామం

### నిందితుల ఆస్తులు అటాచ్ చేసిన ఇడి

**అమరావతి, మార్చి6** : ఏపీ లిక్కర్ స్కాంలో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో పలువురి నిందితుల ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అటాచ్ చేసింది. రాజ్ కసిరెడ్డి, వాసుదేవరెడ్డి, చాణక్యలకు సంబంధించిన రూ.441 కోట్ల ఆస్తులను శుక్రవారం అటాచ్ చేసింది ఈడీ. ఈ మొత్తంలో స్థిర, చరాస్తులు ఉన్నాయి. షెల్ కంపెనీల ద్వారా రూ.104 కోట్లు వీరు కొల్లగొట్టారంటూ ఈడీ వివరించింది. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. అటాచ్ చేసిన జాబితాలో బ్యాంక్ బ్యాలెన్స్‌లు, ఫిక్స్ డ్ డిపాజిట్లు, భూములు ఉన్నాయి. ఇక కసిరెడ్డి రాజశేఖర రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు, అనుబంధ సంస్థలకు చెందిన ఆస్తులను ఈడీ జప్తు చేసింది. బూనేటి చాణక్యకి సంబంధించిన సంస్థల ఆస్తులను అటాచ్ చేసింది. దొంతిరెడ్డి వాసుదేవ రెడ్డి కుటుంబ సభ్యులు, అనుబంధ సంస్థల ఆస్తులను అటాచ్ చేశారు. అలాగే మనీ లాండరింగ్ కేసులో భాగంగా ఈడీ దర్యాప్తు కొనసాగుతోంది. తాత్కాలికంగా ఈ ఆస్తులను అటాచ్ చేసింది. హైదరాబాద్ ఈడీ జోనల్ కార్యాలయం ఆధ్వర్యంలో ఈ చర్యలు తీసుకుంది.

## మరోమారు బొత్సకు అస్వస్థత

### బిపి హెచ్చు తగ్గులతో అలసట

### వెంటనే వైద్యులను పిలిపించి పరీక్షలు

**అమరావతి, మార్చి6** : శాసనమండలిలో ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ మరోమారు అస్వస్థతకు గురయ్యారు. సభలో ప్రసంగిస్తూ ఇబ్బందిపడటంతో అక్కడి అధికారులు అత్యవసరంగా అసెంబ్లీకి వైద్యులను పిలిపించారు. పరీక్షించిన వైద్యులు.. బీపీలో హెచ్చుతగ్గుల వల్లే అస్వస్థతకు గురైనట్లు వెల్లడించారు. ఆయనకు విశ్రాంతి అవసరమని స్పష్టం చేశారు. వైద్యుల సూచన మేరకు బొత్స ఇంటికి బయల్దేరారు. సభలో ప్రసంగించేటప్పుడు పరిస్థితిని గమనించిన ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఆయన్ను విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించే అవకాశం ఉంది. హైబీపీతో ఇబ్బంది పడుతున్న బొత్స.. మండలిలో మాట్లాడుతుండగా కింద పడబోయారు. దీంతో వెంటనే అసెంబ్లీ అధికార వర్గాలు అత్యవసరంగా వైద్యులను పిలిపించి, ఆయన ఛాంబర్‌లోనే వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు పరీక్షలు చేసిన తర్వాత.. ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉందని తెలిపారు. బీపీలో హెచ్చుతగ్గులు, సరైన సమయానికి భోజనం చేయకపోవడం వంటి కారణాల వల్ల ఆయన స్వల్ప అస్వస్థతకు గురయ్యారని వైద్యులు వివరించారు. విశ్రాంతి తీసుకోవాలని, అవసరమైతే మరిన్ని వైద్య పరీక్షలు చేయించాలని సూచించారు. అలాగే, బొత్సతో హైదరాబాద్‌లోని సిటీ న్యూరో హాస్పిటల్ వైద్యుడు డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి ఫోన్‌లో మాట్లాడారు. ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. బొత్స సత్యనారాయణ హైబీపీతో ఇబ్బంది పడుతున్నారని, బీపీ కంట్రోల్‌లోకి రాకపోతే హాస్పిటల్‌కు వెళ్లాల్సి ఉంటుందని వైద్యులు సూచించారు. దీంతో బొత్సను సహచరులు ఆయన నివాసానికి తీసుకెళ్లారు. ప్రస్తుతం బొత్స సత్యనారాయణ ఆరోగ్యం నిలకడగానే ఉందని సమాచారం. అయితే మూడ్రోజుల విశ్రాంతి అనంతరం శుక్రవారమే బొత్స తిరిగి సమావేశాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా
ఆయనను మంత్రి లోకేశ్ ఆత్మీయంగా పలకరించారు. 'బొత్స సత్యనారాయణ గారు నమస్కారం' అంటూ పలకరించారు. బొత్స సత్యనారాయణ వినకపోవడంతో వెంటనే కల్పించుకున్న చైర్మన్.. 'మంత్రి నారా లోకేశ్ మిమ్మల్ని పరామర్శిస్తున్నారు' అంటూ బొత్సకు తెలియజేశారు. వెంటనే మంత్రి మాట్లాడుతూ.. 'గురువుగారు చిన్న అనారోగ్య సమస్యతో బాధపడ్డారు. ఆయన తిరిగి ఆరోగ్యంగా హౌస్‌కు రావడం ఆనందంగా ఉంది' అని మంత్రి లోకేశ్ అన్నారు. ఇటీవల మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే.

## నేడు ఢిల్లీకి సిఎం చంద్రబాబు

### రైసినా డైలాగ్-2026' సదస్సుకు హాజరు

**అమరావతి, మార్చి6** : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం ఢిల్లీకి వెళ్లనున్నారు. దేశ రాజధానిలో జరిగే ప్రతిష్టాత్మక 'రైసినా డైలాగ్-2026' సదస్సుకు హాజరుకానున్నారు. ఈ సదస్సులో సీఎం చంద్రబాబు ప్రసంగించనున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి టూర్ షెడ్యూల్ ఖరారైంది. శనివారం ఉదయం 10:50గంటలకు చంద్రబాబు నాయుడు ఢిల్లీ బయలుదేరుతారు. ఢిల్లీకి చేరుకున్న అనంతరం మధ్యాహ్నం 2గంటలకు ప్రగతి మైదాన్‌లోని భారత్ మండపంలో రైసినా డైలాగ్-2026 సదస్సులో పాల్గొంటారు. భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ- అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైసినా డైలాగ్ సదస్సు నిర్వహిస్తున్నారు. ఈ సదస్సుకు ఫిన్లాండ్ దేశాధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ సహా 110 దేశాలకు చెందిన 2,700మంది ప్రతినిధులు హాజరవుతున్నారు. 'జియో పాలిటిక్స్- జియో ఎకనామిక్స్' అంశం ఆధారంగా చర్చలు సాగనున్నాయి. సదస్సులో 'సాంకేతికత- సుపరిపాలన- భవిష్యత్' అనే అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక ఉపన్యాసం చేయనున్నారు. రియల్ టైమ్ గవర్నెన్స్, డేటా ఆధారిత విధాన నిర్ణయాలు, డిజిటల్ పౌర సేవలు వంటి అంశాలను వివరించనున్నారు. అడ్వాన్స్‌డ్ మాన్యుఫాక్చరింగ్ డెస్టినేషన్‌గా ఏపీని తీర్చిదిద్దేందుకు అనుసరిస్తున్న నిర్ణయాలను వారికి తెలపనున్నారు సీఎం చంద్రబాబు.

## ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ లీసా గిల్

### కేంద్రప్రభుత్వం నోటిఫికేషన్ జారీ

**న్యూఢిల్లీ, మార్చి6** : ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ లీసా గిల్ రానున్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. పంజాబ్, హర్యానా హైకోర్టు నుంచి జస్టిస్ లీసా గిల్‌ను ఏపీ హైకోర్టుకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. జస్టిస్ లీసా గిల్ ఏపీ హైకోర్టులో తొలుత న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఏప్రిల్ నెలలో ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ పదవీ విరమణ చేయనున్నారు. ఆ వెంటనే జస్టిస్ లీసా గిల్ ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్నారు. సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సుల మేరకు కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. ఏపీ హైకోర్టు చరిత్రలో తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ లీసా గిల్ రికార్డు సృష్టించనున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

**వనపర్తి, మార్చి6** : వనపర్తి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఏదుల మండల కేంద్రం సమీపంలో ఓ ఆటో ట్రాక్టర్‌ను ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో మృతిచెందిన వారిని వెంకటయ్య (50), సుమిత్ర (42)గా గుర్తించారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు వనపర్తి జిల్లా పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. గాయపడిన వారిని సమీప ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారికి చికిత్స అందిస్తున్నారు. ఈ ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనతో స్థానిక ప్రాంతంలో విషాద వాతావరణం నెలకొంది.

# భద్రాచలంలో ఘనంగా సంత్ సద్గురు సేవాలాల్ 287వ జయంతి వేడుకలు





**మార్చి 6, జన సంఘర్షణ:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎందరో మహనీయులు పుట్టిన గడ్డ మన భారతదేశం అని దాంట్లో కారణ జన్ముడు, బంజారా జాతి ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ మహారాజ్ జాతిని ఒకే తాటిపై నడిపించిన మహనీయుడు సేవాలాల్ మహారాజ్ అడుగుజాడ లో నడిచి ఆయన ఆశయ సాధనం కోసం ప్రతి గిరిజన బిడ్డ కృషి చేయాలని, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్ రావు అన్నారు. శుక్రవారం భద్రాచలం పట్టణంలోని గిరిజన భవనం లో ఏర్పాటు చేసిన సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి సందర్భంగా సంత్ సద్గురు సేవాలాల్ మహారాజ్ 287వ ఉత్సవ కమిటీ భద్రాచలం నియోజకవర్గ ఆధ్వర్యంలో భోగ బండారో కార్యక్రమం నిర్వహించిన కార్యక్రమానికి ఐటీడీఏ పీవో బి. రాహుల్ బంజారా కమిటీ సభ్యులతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సంత్ సేవాలాల్ మహారాజ్ కార్యక్రమానికి వచ్చిన ముఖ్య అతిథులకు కమిటీ సభ్యులు బంజారా సాంప్రదాయ పరకారం ఘనంగా స్వాగతం పలికారు. సంత్ సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలవేసి భోగ్ బండారో, వింతీ కార్యక్రమం బంజారా సోదరుల సమక్షంలో ప్రతిజ్ఞ చేసిన అనంతరం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ జాతీ ఐక్యత కోసం అందరం పాటుపడాలని, పిలుపునిచ్చారు. లంబాడీలు దేవుడిగా భావించి సంత సేవాలాలును కొలుస్తారని, సేవాలాల్ జంతుబలికి తీవ్ర వ్యతిరేకి అని, తల్లిదండ్రులను మహిళలను గౌరవించాలని ప్రజలకు ఆయన బోధించారు. ప్రకృతిని వన్యప్రాణులను పరిరక్షించడం ద్వారా మానవజన్మ సార్థకత చేకూర్చుకోవాలని సూచించేవారని,ఒక సంఘ సంస్కర్త, ప్రకృతి ప్రేమికుడు ఆధ్యాత్మిక గురువు, బంజారాల సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షకుడు, జాతి ఉద్ధారకుడు, భారతదేశంలో 10 కోట్లకు పై చిలుకు జనాభా కలిగిన బంజారాలు ప్రతి సంవత్సరం సేవాలాల్ జయంతిని జరుపుకుంటున్నారని అన్నారు. అనంతరం ఐటీడీఏ పీవో బి. రాహుల్ మాట్లాడుతూ చత్రపతి శివాజీ, గురునానక్, గౌతమ బుద్ధుడి లాంటి మహనీయులు ప్రజల జీవన విధానం కొరకు ఏ విధంగా పాటుపడ్డారో, లంబాడి బంజారా తెగల జీవన విధానం బాగుపడటానికి ఆయన చేసిన కృషి ఎనలేనిదని, అటువంటి మహనీయుల కోవకు చెందిన వాడే సంత్ సేవలల్ మహా రాజ్ అని, మన భారత దేశంలోనే కాక కర్ణాటక నుండి ఉత్తరప్రదేశ్ వరకు రాజస్థాన్ నుండి తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో ఉన్న బంజారా జాతి జీవన విధానం కొరకు ఆయన పాటుపడ్డారని, దేశంలోని గోరు బంజారాలకు స్ఫూర్తిని నింపిన మహానుభావుడు అని, సంచార జీవితం నుండి ప్రతి బంజారా తెగలను తండ జీవితం వైపు మళ్ళించారని, మద్యం మాంసాలను మాన్పించే ప్రయత్నం చేశాడని, బంజారా తెగల అభివృద్ధికి దేశమంతటా సంచారం చేసి హితబోధ చేశాడని ఆయన అన్నారు. బ్రిటిష్ కాలంలో కూడా మతమార్పిడిని వ్యతిరేకించిన మహనీయుడనీ, సేవాలాల్ మహారాజ్ 18వ శతాబ్దానికి చెందిన గొప్ప ఆధ్యాత్మిక గురువు , సంఘసంస్కర్త, ఆయనను బంజారా లు తమ ఇష్ట దైవంగా పూజిస్తారని, ఆయన ఫిబ్రవరి 15, 1739న అనంతపురం జిల్లాలోని గుత్తి సమీపంలోని సేవాగడ్ (రామచంద్రపురం) లో జన్మించారని, అహింస, శాంతి, మానవత్వాన్ని ఆయన బోధించేవారని, ముఖ్యంగా మూఢనమ్మకాలను విడనాడాలని, పర్యావరణాన్ని ప్రేమించాలని, మహిళలను గౌరవించాలని ఆయన ప్రజలకు హితబోధ చేసేవాడని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో భద్రాచలం జడ్జి శివ నాయక్, డిడి ట్రైబల్ వెల్ఫేర్ అశోక్, భద్రాచలం తాసిల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు, పివిటిజి అధికారి గన్యా, బంజారా సంఘం నాయకులు భూక్యా రంగా, లకావత్ వెంకటేశ్వర్లు, బన్సీలాల్, మోహన్ లాల్, గోవింద్, భూక్యా రంజిత్, రాందాస్, భూక్య సాయి కౌశిక్, నాగులు, వంకుదోత్ కృష్ణ, బిక్ష, సైదులు, శీతల నాయక్, రాందాస్, మోహన్ నాయక్, కోటి, జుంకీలాల్, సీతయ్య నాయక్, మదన్ నాయక్, మదర్, బంసిలాల్ ,వివిధ ప్రాంతాల నుండి వచ్చిన బంజారా సోదరులు, సోదరీమణులు, తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగాన్ని అంతం చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం..

- రాష్ట్ర వార్షిక బడ్జెట్లో యువజన రంగానికి అధిక నిధులు, జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి
- ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్కే చాంద్ పాషా

**6 మార్చి, జన సంఘర్షణ :**



నిరుద్యోగాన్ని అంతం చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యారని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) జిల్లా సహాయ కార్యదర్శి ఎస్కే చాంద్ పాషా అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మన దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం వల్ల తీవ్ర ఆందోళన వ్యక్తమవుతుందన్నారు. అటు ప్రభుత్వ రంగం నుండి కొత్త ఉద్యోగ ప్రకటనలు తక్కువగా రావడం, ఇటు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కోల్పోవడం, ఈ రెండు కలసి ఒక కుంభమేళం లాగా నిరుద్యోగాన్ని పెంచిపెడుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వ నియామక ప్రక్రియలు చాలా నెమ్మదిగా జరగడం, గ్రూప్ పరీక్షల ప్రకటనలు సంవత్సరాల తరబడి అలస్యం అవుతుండగా, నియామకాల్లో తారతమ్యాలు, కోర్టుల స్టేలు, రాజకీయ ప్రతిస్పందనలు మరింత కల్లోలం సృష్టిస్తున్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో యువత తమ జీవిత భద్రతపై ఆశను కోల్పోతున్నారన్నారు. రాబోయే 10-20ఏళ్లలో మనం తీవ్ర సంక్షోభాన్ని, సామాజిక అసమతుల్యతను ఎదుర్కోవల్సి వస్తుందని. దీనికి పరిష్కార మార్గాలు ఉన్నప్పటికీ, వాటిని అమలు చేయాలన్న చొరవ పాలకుల నుండి కనిపించడం లేదన్నారు. ఉద్యోగ నియామక ప్రక్రియలు వేగవంతం చేయాలని, ఖాళీలను నిబంధనలతో నింపాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదే అని అన్నారు. నిరుద్యోగ యువతకు నిరంతరం ధైర్యం ఇచ్చేవిధంగా ప్రభుత్వ రంగం ముందుకు రావాలని,. నిరుద్యోగ యువతకు ప్రభుత్వ ఆర్థిక మద్దతు లేదా స్వయం ఉపాధి యోజనాల ద్వారా భరోసా కల్పించాలన్నారు. నవతరానికి సామాజిక భద్రత, పెన్షన్, ఆరోగ్యబీమా, విద్యా సహాయం వంటి రంగాల్లో యువతకు మద్దతు ఇవ్వడం ద్వారా వారి భవిష్యత్తుపై నమ్మకాన్ని పెంచాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై వున్నదని అన్నారు. ఈ మార్గాల్లో చర్యలు తీసుకోకపోతే రేపటి సమాజం ఘోరసంక్షోభాన్ని ఎదుర్కొవలసి వస్తుందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్రమోదీ ప్రభుత్వం గడిచిన 12ఏండ్ల కాలంలో బడా కార్పొరేట్ లకు 15లక్షల కోట్ల రూపాయల దేశ సంపదను అక్రమంగా దోచి పెట్టిన నీచ చరిత్రను మూటగట్టుకున్నారని వారు ధ్వజమెత్తారు. గతంలో బడా కార్పొరేట్ శక్తులు ప్రభుత్వం కు 37శాతం పన్ను కడితే, ఈ బీజేపీ హయాంలో దానిని 16శాతానికి తగ్గించారని, దీని కారణంగా దేశ సంపదకు 9లక్షల కోట్ల రూపాయలు నష్టం వాటిల్లిందని ఆరోపించారు.బడా కుబేరులకు యథేచ్ఛగా రాయితీలు ప్రకటించి, కార్పొరేట్ సంస్థల ఊడిగం చేస్తున్నారని ధ్వజమెత్తారు.

అదే విధంగా తెలంగాణ రాష్ట్రంలో లక్షలాది నిరుద్యోగ యువత ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం మరియు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ఇప్పటికీ సంపూర్ణ జాబ్ క్యాలెండర్ ప్రకటించకపోవడం తీవ్ర అన్యాయం అని, ప్రభుత్వ శాఖల్లో లక్షల సంఖ్యలో పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ, వాటి భర్తీకి సంబంధించి స్పష్టమైన కాలపట్టిక ఇవ్వకపోవడం వల్ల యువతలో అయోమయం, ఆందోళన పెరుగుతోందని, ఇది కేవలం పరిపాలనా వైఫల్యం అని, ఈ నెలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న వార్షిక బడ్జెట్లో యువజన రంగానికి అధిక నిధులు కేటాయించాలని, జాబ్ క్యాలెండర్ ను విడుదల చేయాలని, రాజీవ్ యువ వికాస పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# కెపిహెచ్బి ఫంక్షన్ హాల్ లో మార్చి 8న భారీ కార్యక్రమం

- ముఖ్యఅతిథిగా కమిషనర్ శ్రీజనను హాజరు కావాలని ఆహ్వానించిన బండి రమేష్.



**హైదరాబాద్ మార్చి 06,(జన సంఘర్షణ):** సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ శ్రీజనను టిపిసిసి ఉపాధ్యక్షుడు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ స్థానిక నాయకులతో కలిసి శుక్రవారం రోజు హైటెక్స్ లోని అమె కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కెపిహెచ్బి కాలనీ రోడ్ నెంబర్ వన్ హౌసింగ్ బోర్డ్ ఫంక్షన్ హాల్ లో మార్చి నెల 8న జరగనున్న భారీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రావాల్సిందిగా కోరుతూ ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు ఆమెకు పూల బొకే ఇచ్చి శాలువాతో సత్కరించారు. స్థానిక సమస్యలను ప్రస్తావించి పరిష్కరించాల్సిందిగా కోరారు.ఈ నేపథ్యంలో కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు రమేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సత్యం శ్రీరంగం, గాలి బాలాజీ, తూము వేణు, శేరి సతీష్ రెడ్డి, సాదు ప్రతాప్ రెడ్డి, కొప్పిశెట్టి దినేష్ కుమార్, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, కృష్ణ రాజ్ పుత్, రంగమోహన్, మస్తాన్ రెడ్డి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# గోరక్ష అందరి బాధ్యత...

- విహెచ్పి విభాగ కార్యదర్శి



**జంగంపల్లి :మార్చ్ 6 (జనసంఘర్షణ)** గోవులను రక్షించడం ప్రతీ పౌరుడి బాధ్యతని విశ్వహిందూ పరిషత్ ఇందూరు విభాగ కార్యదర్శి తమ్మల కృష్ణ, అన్నారు. శుక్రవారం రోజు జంగంపల్లి గోశాలను సందర్శించిన ఆయన ప్రతి ఒక్క హిందువు ఇంట్లో ఒక గోవును పెంచుకోవాలని గోవు ద్వారా ఆదాయంతో పాటు, ఆరోగ్యం కూడా కలుగుతుందని అన్నారు. అలాగే గోవు ఉత్పత్తులను ప్రతి ఒక్కరు వాడితే ఎలాంటి అనారోగ్యాలు దరిచేరవని అన్నారు. ప్రభుత్వం గోశాలలకు ప్రోత్సాహకాలు ఇవ్వాలని జిల్లా విహెచ్పి అధ్యక్షులు ఆధారపు నిత్యానందం కోరారు.ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, బబ్లు, బజరంగ్దళ్ కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

# గుండెపోటుతో మరణించిన చాకలి సాయిల్‌కి ఆర్థిక సాయం..

**కిష్టాపూర్. మార్చ్ 06 (జనసంఘర్షణ)**



బీర్కూర్ మండలం కిష్టాపూర్ గ్రామంలో ఇటీవల గుండెపోటుతో మరణించిన చాకలి సాయిలు నిరుపేద కుటుంబానికి అంత్యక్రియల కోసం గ్రామ మిత్రులు సన్నిహితులు అందరు కలిసి 21800 రూపాయలను వారి కుమారుడికి ఇవ్వడం జరిగింది..

# ఏఐఎస్‌బీ బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో స్టూడెంట్స్‌కి ఎగ్జామ్ ప్యాడ్స్ పంపిణీ..




**బాన్సువాడ: మార్చి 06 (జనసంఘర్షణ)** ఆల్ ఇండియా స్టూడెంట్స్ బ్లాక్ (బీసీ.వీఎస్) బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో బాన్సువాడ మండలం తిరుమలపూర్‌లో జెడ్పీహెచ్ఎస్ హైస్కూల్‌లో పదవ తరగతి విద్యార్థులకు బాన్సువాడ మండల విద్యాధికారి నగేష్ రావ్ చేతులమిదుగా ఎగ్జామ్స్ ప్యాడ్స్, పెన్నులు అందజేశారు.

# ప్రజాపాలన-ప్రగతి కార్యక్రమంలో భాగంగా బాన్సువాడ మున్సిపాలిటీలో సబ్ కలెక్టర్ కిరణ్మయి పర్యవేక్షణలో సమీక్ష సమావేశం



**బాన్సువాడ:మార్చ్ 06 (జనసంఘర్షణ)** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన-ప్రగతి కార్యక్రమంలో భాగంగా బాన్సువాడ మున్సిపాలిటీలో శుక్రవారం సబ్ కలెక్టర్ కిరణ్మయి పర్యవేక్షణలో సమీక్ష నిర్వహించారు. 99 రోజుల కార్యాచరణలో భాగంగా మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ సహా కౌన్సిలర్లు, అధికారులు కలిసి ప్రజా సమస్యలను సమీక్షించారు. ముఖ్యంగా పట్టణ అభివృద్ధి, పారిశుద్ధ్యం, డ్రైనేజ్ సమస్యలు, ప్రజా సేవలు వంటి అంశాలపై చర్చ జరిగింది. ఈ నెల 6 నుంచి 12వ తేదీ వరకు కార్యక్రమాలు కొనసాగుతాయని, ప్రజా సమస్యలపై స్పందిస్తూ పరిష్కారాలు అందిస్తామని అధికారులు తెలిపారు. ప్రజలతో నేరుగా మమేకమవుతూ ప్రజాపాలనను విజయవంతం చేస్తామని సబ్ కలెక్టర్ కిరణ్మయి స్పష్టం చేశారు.

# తాసిల్దార్ గ్రామస్తులతో సమావేశం..



**తాడ్వాయి:మార్చ్ 06 (జనసంఘర్షణ)** తాడ్వాయి మండలం ఎర్రపహడ్ గ్రామ పంచాయతీ కార్యలాయములో దళితుల పై కొందరు అగ్ర కులాస్తులు విదించిన ఆంక్షలపై పూర్తి వివరాలు సేకరణ సమావేశం తాడ్వాయి ఎమ్మార్వో శ్వేత ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు నిర్వహించారు. గ్రామంలోని అగ్రకులాల వారు సదస్సుకు రాకపోవడంతో తదుపరి విచారణ సమావేశం గ్రామస్తులు సమక్షంలో నిర్వహిస్తామని ఆమె తెలియజేశారు .

# రాజన్న సిరిసిల్ల జిల్లాకు ప్రతిష్టాత్మక కోర్టు భవన నిర్మాణం

❑ నేడు శంకుస్థాపన కార్యక్రమం
❑ అతిథులుగా హైకోర్టు న్యాయమూర్తులు

సిరిసిల్ల . మార్చ్ 06. (జన సంఘర్షణ )

నూతనంగా నిర్మించ తలపెట్టిన కోర్టు భవనాల సముదాయం జిల్లా కేంద్రానికి మరో ఆకర్షణగా నిలవనుంది. మరో 50 సంవత్సరాల అవసరాలు తీర్చేలా అత్యాధునిక వసతులతో నిర్మించ తలపెట్టిన భవన నిర్మాణానికి శనివారం ఉదయం శంకుస్థాపన జరగనుంది. పాత కోర్టు స్థానంలోనే సుమారు 5 ఎకరాల విస్తీర్ణంలో 81.6 కోట్ల వ్యయంతో రూపుదిద్దుకోనున్న భవనంలో 12 రకాల న్యాయస్థానాలు కొలువుదీరేలా తీర్చిదిద్దనున్నారు. ఒక్కో అంతస్తులు 21 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో భవన నిర్మాణం జరగనుంది. విశాలమైన కోర్టు హాళ్లు, ప్రతి అంతస్తులు ప్రత్యేకంగా వాష్ రూమ్లు, దక్షిణారులకు వెయిటింగ్ హాళ్లు, కనీసం 300 కార్లకు పార్కింగ్ సౌకర్యం కల్పిస్తూ నూతన భవనం నిర్మించబోతున్నారు. సెల్లార్తోపాటు టెన్ ప్లస్ టు నిర్మాణ శైలితో రాబోయే రెండేళ్లలో పూర్తిస్థాయిలో భవన నిర్మాణాన్ని పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని సంకల్పంతో ముందుకు సాగుతున్నారు.

**నేడు హైకోర్టు న్యాయమూర్తుల శంకుస్థాపన**

న్యాయస్థాన భవన సముదాయానికి శనివారం శంకుస్థాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు శుక్రవారం ప్రత్యేకంగా కోర్టు ప్రాంగణంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నీరజ మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరిష్ కుమార్ సింగ్ వర్చువల్ విధానాల్లో శంకుస్థాపనలో పాల్గొంటున్నారని వెల్లడించారు. వీరితోపాటు హైకోర్టు న్యాయమూర్తి కం జిల్లా కోర్టు పరిపాలన న్యాయమూర్తి జస్టిస్ ఎన్ తుకారాంజీ, జస్టిస్ కె లక్ష్మణ్, జస్టిస్ విజయసేన్ రెడ్డి, జస్టిస్ నందికొండ నర్సింగరావు, జస్టిస్ ఇవి వేణుగోపాల్, జస్టిస్ పుల్లా కార్తీక్, ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని తెలిపారు. జిల్లాలోని రెండు రెండు నియోజకవర్గాల్లోని న్యాయవాదులు ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో న్యాయమూర్తులు బి.పుష్పలత, రాధిక జైస్వాల్, పి.లక్ష్మణ చారి, ఏ.ప్రవీణ్ కుమార్, న్యాయవాదుల సంఘం సిరిసిల్ల వేములవాడ అధ్యక్షులు జూపల్లి శ్రీనివాసరావు, సదానందం సీనియర్ జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.




# అత్యాధునిక వైద్య నిపుణుల సేవలు వినియోగించుకోవాలి..

❑ ఈ నెల 6 వ తేదీ నుంచి 31 వ తేదీ వరకు షెడ్యూల్ విడుదల

సిరిసిల్ల . మార్చి 06 (జన సంఘర్షణ )

"ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" 99 రోజుల ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశాల మేరకు ప్రత్యేక వైద్య నిపుణుల సేవలు వినియోగించు కోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్. ఎస్ రజిత తెలిపారు. అన్ని వయసుల వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించామని వెల్లడించారు. నిర్దేశిత రోజులలో నాలుగు దశలలో నిర్వహిస్తామని వివరించారు. మొదటి దశలో మార్చి 6 నుండి మార్చి 31 వరకు గర్భిణీలు, వృద్ధులకు రక్తహీనత నిర్ధారణ పరీక్షలు తెలంగాణ డయాగ్నొస్టిక్స్ సెంటర్ ద్వారా ఆరోగ్య సేవలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని వైద్యులు, ఆర్‌బీఎస్‌కే బృందాలు, ఇతర వైద్య సిబ్బందికి గర్భిణీ స్త్రీలకు , తల్లులకు అందవలసిన పోషకాహారము,




వ్యాధినిరోధక టీకాలపై అవగాహన కల్పించడంతోపాటు గర్భాశయ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్లపై ఆరోగ్య పరీక్షలు ప్రత్యేక వైద్య నిపుణుల ప్రసూతి స్త్రీ రోగనిపుణులు, పిల్లల వైద్య నిపుణులు, నేత్ర, కీళ్ల ఎముకల, దంత వైద్య నిపుణులతో పాటు జనరల్ మెడిసిన్ వైద్యులు పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నెల 8వ తేదీన గర్భాశయ క్యాన్సర్ రాకుండా స్త్రీలకు హెచ్ పీవీ వ్యాక్సిన్ ఇస్తామని పేర్కొన్నారు. ప్రత్యేక వైద్య నిపుణులతో ఈ తేదీల్లో వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ నెల (మార్చి ) 7వ తేదీన హనుమాజిపేట, 9వ తేదీన కోనరావుపేట, 10 వ తేదీన లింగన్నపేట, 11 వ తేదీన పోతుగల్, 12 వ తేదీన విలాసాగర్, 13 వ తేదీన ఎల్లారెడ్డిపేట, 14 వ తేదీన పెద్దలింగాపూర్, 16 వ తేదీన నేరెళ్ల, 17 వ తేదీన తంగళ్ళపల్లి, 18 వ తేదీన కొదురుపాక, 20 వ తేదీన సిరిసిల్లలోని సుందరయ్య నగర్ అర్బన్ హెల్త్ సెంటర్, 23 వ తేదీన సిరిసిల్లలోని అంబేద్కర్ నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ నగర్, 24వ తేదీన చీర్లవంచ, 25 వ తేదీన బోయినపల్లి, 26 వ తేదీన కోనరావుపేట, 28 వ తేదీన పోతుగల్, 30 వ తేదీన విలాసాగర్, ఈ నెల (మార్చి) 31 వ తేదీన సిరిసిల్లలోని సుందరయ్య నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ లో ప్రత్యేక వైద్య నిపుణులతో వైద్య ఆరోగ్య శిబిరాలు, పరీక్షలు నిర్వహించి చికిత్స అందిస్తామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత తెలిపారు.

## పాత పాల్వంచ 46వ డివిజన్‌లో కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి ఆధ్వర్యంలో ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమం

6.. మార్చి.. జన సంఘర్షణ :

తెలంగాణా ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం నుండి తలపెట్టిన ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పాత పాల్వంచ 46వ డివిజన్‌లో కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి ఆధ్వర్యంలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. పాత పాల్వంచలోని నాలుగు మంచినీటి బావులలో బ్లీచింగ్ పొడి చల్లించారు. పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేయించారు. మైసమ్మతల్లి దేవాలయం వెనుక బజార్లో డ్రైనేజీ క్లీనింగ్, వేంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద చెత్తకుప్పలు తొలగించారు. డ్రైన్లకు, రోడ్డు ప్రక్కన వున్న మొక్కలను, చెట్లను కొట్టివేయించారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపాలిటీ సిబ్బంది, ఎస్‌హెచ్‌జీ గ్రూప్ సభ్యులు, మహిళలు, పాత పాల్వంచ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.






## డాక్టర్ గుమ్మడి కిరణ్, స్వప్నల గారాలపట్టి నక్షత్రతో స్నేహితులు, శ్రేయోభిలాషులు

❑ శుభకరం.. సంతోషకరం..చిన్నారి నక్షత్ర నామకరణం..
❑ కనులపండువగా కిరణ్, స్వప్నల గారాలపట్టి నేమింగ్ సెర్మణి

హైదరాబాద్, మార్చి 06 (జన సంఘర్షణ):



శ్రేష్ఠ ఐ క్లినిక్ అధినేత, డాక్టర్ గుమ్మడి కిరణ్, స్వప్నల న్యూ బోర్న్ బేబీ నామకరణం కూకట్ పల్లి బాలాజీనగర్‌లోని స్వగృహంలో అంగ రంగ వైభవంగా జరిగింది. బంధు మిత్రులు, శ్రేయోభి లాషులు, కుటుంబ సభ్యుల సమక్షంలో చిన్నారికి నక్షత్ర అని నామకరణం చేశారు. చిన్నారితో పాటు ఆమె పేరు కూడా అందంగా ఉందని అతిథులు ఆనందం వ్యక్తం చేశారు. చిన్నారిని మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు. నిండునూరేళ్లు ఆరోగ్యంగా ఉండి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అభిలాషించారు. నక్షత్ర తల్లిదండ్రులు కిరణ్, స్వప్నలకు శుభాకాంక్షలు తెలిపారు. అతిథులకు నాన్‌వెజ్ వంటకాలతో చిన్నారి తల్లిదండ్రులు ఆతిథ్యం ఇచ్చారు. ఆహ్వానించగానే తమ చిన్నారిని ఆశీర్వదించేందుకు కుటుంబ సభ్యులతో తరలివచ్చిన అతిథులకు, బంధుమిత్రులకు కిరణ్, స్వప్నలు ధన్యవాదాలు తెలిపారు. నామకరణ వేడుక ఆద్యంతం సందడిగా, ఆనందంగా సాగడంపై సంతోషం వ్యక్తం చేశారు.

## రాజ్యసభ అభ్యర్థిగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం

హైదరాబాద్ మార్చి 06,(జన సంఘర్షణ):




కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ అభ్యర్థిగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డిని వారి నివాసంలో పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ నేపథ్యంలో పార్టీ అధిష్టానం రాజ్యసభకు అవకాశం కల్పించటం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ ముఖ్యమంత్రికి కాంగ్రెస్ పార్టీ నాయకులకు వారధిగా ఉండి, ప్రతి కార్యకర్త సమస్యలను తెలుసుకుంటు సామాన్య కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పార్టీని బలోపేతం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ప్రముఖ పాత్ర పోషించి, కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి విశేష కృషి చేసి సీఎం రేవంత్ రెడ్డికి వెన్నంటే ఉండి, అహర్నిశలు కష్టపడ్డా సరైన వ్యక్తికి గుర్తింపు వచ్చిందని హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ సలహాదారుగా సేవలందించిన వేం నరేందర్ రెడ్డి రాజ్యసభ అభ్యర్థిగా ఎన్నిక కావడం అభినందనీయం అన్నారు.

## మాజీ జడ్పీ చైర్మన్ గోనెల విజయలక్ష్మి భౌతికకాయానికి నివాళులు

❑ పూలమాల వేసి నివాళులు అర్పించిన జిఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ కోఆర్డినేటర్ మోదుగు జోగారావు ట్రస్ట్ మేనేజర్ చంద్రగిరి అంజి

6... మార్చి.. జన సంఘర్షణ



ఉమ్మడి ఖమ్మం జిల్లా మజీ జిల్లా చైర్మన్, గోనెల. నారాయణ సతీమణి, గోనెల విజయలక్ష్మి బౌతికకాయానికి ఘనమైన నివాళ్ళు అర్పించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపిన డా. జి.యస్.ఆర్. చారిటబుల్ ట్రస్ట్ కో ఆర్డినేటర్ మోదుగు జోగారావు, ట్రస్ట్ మేనేజర్ చంద్రగిరి, అంజి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## దోమల వల్ల విష జ్వరాలు, దోమల నివారణకై ఏంటామాలాజి చర్యలు

❑ బేరి రామచందర్ యాదవ్.

హైదరాబాద్, శేరిలింగంపల్లి మార్చి 06, (జన సంఘర్షణ):



శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి నల్లగండ్ల డివిజన్ నేతాజీ నగర్ కాలనీలో దోమల నివారణకై చర్యలు తీసుకోవాలని కాలనీ అధ్యక్షులు బేరి రామచంద్రర్ యాదవ్ కాలనీలో ఓపెన్ నాళాలు చెత్తా చెదారంతో పేరుకుపోయి పోయి దోమలు విజృంభిస్తున్నాయని భేరి తెలిపారు. దోమల వల్ల చిన్నారులు, వృద్ధులు విష జ్వరాలు డెంగ్యూ, మలేరియా రోగాలు సంభవిస్తున్నాయి. జిహెచ్ఎంసి ఎంటమాల జెసి సిబ్బంది ద్వారా దోమల నివారణకై చర్య దోమల ఫాగింగ్ దోమల పొగ ద్వారా దోమల నివారణ చర్యలు చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షులు రామచంద్రర్ యాదవ్ మాట్లాడుతూ కాలనీలోని ప్రజలందరూ కూడా పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని ఎప్పటికప్పుడు చెత్తచెదారం ఎక్కడ లేకుండా శుభ్రంగా పెట్టి చెత్త వీధిలో పడి వేయకుండా జిహెచ్ఎంసి ఆటోకు చెత్త వేయవలసిందిగా కాలనీ ప్రజలను విజ్ఞప్తి చేశారు.

## మహిళను వేధించిన కేసులో వ్యక్తికి ఏడాదిన్నర జైలు

భద్రాద్రి కొత్తగూడెం :(జన సంఘర్షణ)



ఇల్లెందు, మార్చి 06 : మహిళను వేధించిన కేసులో దోషిగా తేలిన వ్యక్తికి న్యాయస్థానం 18 నెలల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధించింది. కేసు వివరాలు. . 2019లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు 24 ఏరియాకు చెందిన ఏర్పుల కృష్ణ ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటూ జీవిస్తున్నాడు. అదే ఏరియాలో ఉన్న ఓ మహిళను తరచూ వేధింపులకు గురి చేయడంతో ఆ మహిళ ఇల్లెందు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి సీఐ వేణు చందర్ కేసు దర్యాప్తు చేసి నివేదికను కోర్టుకు సరెండర్ చేశారు. విచారణలో కృష్ణ దోషిగా తేలడంతో జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు ఇల్లెందు జడ్జి డి.చంద్రిక రెడ్డి తీర్పు వెలువరించారు. ఈ కేసులో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నర్సింగు అనిల్ కుమార్ ప్రాసిక్యూషన్ తరపున వాదించగా, సిడిఓ సురేశ్, రాఘవయ్య, హెచ్ సి అనంత రాములు సహకరించారు.

## బయ్యారం గ్రామంలో వివాహ రిసెప్షన్ వేడుకలో పాల్గొన్న సర్పంచ్ గుగులోత్ శాంతి

భద్రాద్రి కొత్తగూడెం ( జన సంఘర్షణ)



బయ్యారం గ్రామ పంచాయతీ పరిధిలోని కమ్మవారి కళ్యాణ మండపంలో నిర్వహించిన వివాహ రిసెప్షన్ వేడుకల్లో బయ్యారం సర్పంచ్ గుగులోత్ శాంతి, కిషన్ నాయక్ పాల్గొన్నారు. బయ్యారం గ్రామ పంచాయతీ కాకతీయ నగర్‌కు చెందిన తిరుమల శ్రీనివాస్ రెడ్డి, ఉమా దంపతుల కుమారుడు తిరుమల సందీప్ రెడ్డి-అంకిత రెడ్డి వివాహ రిసెప్షన్ కార్యక్రమం ఈ రోజు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ గుగులోత్ శాంతి, కిషన్ నాయక్ నూతన వధూవరులను ఆశీర్వదించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ సభ్యులను మర్యాదపూర్వకంగా కలుసుకొని వివాహ వేడుకలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కంబాల ముసలయ్య, మహబూబాబాద్ పార్లమెంట్ లీగల్ అడ్వయిజర్ గుగులోత్ కిషన్ నాయక్, బయ్యారం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాయిని శ్రీనివాస్ రెడ్డి, రేలా ఇందిరా, ఎనుగుల రంజిత్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# పదార్థమర్మం




పదార్థం పరమాణుత్వం పొంది
ప్రకృతిలో కలిసి పోతేనే...
పదార్థగమనం ప్రకృతి విజయం
నశించని పదార్థం పాషాణమై
సమతుల్యత పై పంజావిసిరి
జీవకోటి హననానికి ఆజ్యం పోస్తే...?
ప్రకృతి పంచిన ప్రతిపదార్థం
మానవమనుగడ కాంక్షించేదే...
జ్ఞాన తృష్ణతో రూపొందినవే...
వినాశవిస్పోటాలవుతున్నయ్
సౌకర్యం, సౌలభ్యం
చవకధరలే ప్రేరకాలై
కృత్రిమావిష్కరణ ఉద్దీపాలై
విచక్షణ లేని వినియోగం వికృతమై వేళ్ళూనుతుంది
మట్టినపుట్టిన ప్రతిపదార్థం
మట్టినిచేరుటే పరమార్థం
మట్టికి మనిషికి సవాళ్ళనిసిరే
ప్లాస్టిక్ భూతం తరిమేద్దాం
ప్రత్యామ్నాయపు మార్గాలెరిగి
పుడమి తల్లి ని పునీతచేద్దాం
ప్లాస్టిక్ నిషేద ఆవిష్కరణలతో
స్వయం సమృద్ధిసాదిద్దాం...
విజయబావుటా ఎగరేద్దాం..

**– కొండూరి కోటిబాబు, హైకోర్టు అడ్వకేట్, ఎస్‌పిటియు, హైదరాబాద్.**

## అభివృద్ధి సంక్షేమం కోసం పాటుపడుతున్న కూటమి ప్రభుత్వం

కుప్పం, మార్చి 06 ( జన సంఘర్షణ )



రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కృషి చేస్తూ ఉందని చిత్తూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి సాంబశివం, తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాజగోపాల్ అన్నారు. శుక్రవారం కుప్పం రూరల్ మండల పరిధిలో ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు ఆదేశాలతో మిట్టపల్లి గ్రామ పంచాయతీలో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల పంపిని కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అధేవిధంగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమం ప్రతి ఇంటికి వెళ్లి తెలియజేయాలని కె ఎస్ ఎస్ సభ్యులను కోరారు. ఈ కార్యక్రమంలో కడ సలహా మండలి సభ్యులు రామచంద్ర ,హైదర్వల్లి, క్లస్టర్ ఇంచార్జి శరవణ, రాష్ట్ర డైరెక్టర్ చలపతి, సీనియర్ నాయకులు ,లీలావెంకటేష్ యూనిట్ఇన్‌ఛార్జ్, సంతోష్, సర్పంచ్, కనకరాజు మండల యూత్ అధ్యక్షులు, మంజు, పంచాయతీ పార్టీ అధ్యక్షులు, శివ బూత్ ఇంచార్జ్,షబీర్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

## విజ్ఞాన వారోత్సవాల పోటీల్లో తృతీయ బహుమతి సాధించిన బిందు శ్రీ



కుప్పం, మార్చి 06 ( జన సంఘర్షణ )

విజ్ఞాన వారోత్సవాలలో గుడిపల్లి కి చెందిన బిందు శ్రీ తృతీయ స్థానాన్ని దక్కించుకుంది. చిత్తూరు జిల్లా విద్యాశాఖాధికారి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన 'విజ్ఞాన వారోత్సవాల' పోటీలలో గుడుపల్లి ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థిని, 8వ తరగతి చదువుతున్న బిందుశ్రీ తృతీయ బహుమతి సాధించింది. దీంతో కళాశాల ఉపాధ్యాయులు సహచర విద్యార్థినీ లు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

## విద్యార్థులకు రాత సామాగ్రి పంపిణీ

సదుం మార్చి 06 ( జన సంఘర్షణ )

సదుం పట్టణానికి చెందిన వ్యాపారవేత్త రమా మహేశ్వరి మండల పరిధిలోని పదవ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు రాత సామాగ్రిని ఉచితంగా పంపిణీ చేశారు. సదుం ,పాలమంద, చెరుకువారిపల్లె, బురగ మంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అట్టలు పెన్నులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థులు మంచి మార్కులతో పాసై పాఠశాలలకు ,వారి తల్లిదండ్రులకు, వారి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని చెప్పారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## జానకంపేటలో ఛత్రపతి శివాజీ మహారాజు విగ్రహ ప్రతిష్టాపన 3వ వార్షికోత్సవం





ఎడపల్లి, మార్చి 06 ( జన సంఘర్షణ )

ఎడపల్లి మండలం జానకంపేట గ్రామంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠాపనకు మూడు సంవత్సరాలు పూర్తైన సందర్భంగా మూడవ వార్షికోత్సవాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ యువకులు, నాయకులు కలిసి శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం గ్రామ ప్రజలకు పండ్లను పంపిణీ చేసి కార్యక్రమాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ నీలం కృష్ణ మాట్లాడుతూ, శివాజీ మహారాజ్ ధైర్యసాహసాలకు ప్రతీక అని, యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకొని సమాజ సేవలో ముందుండాలని సూచించారు. గ్రామంలో ఐక్యతతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. భవిష్యత్తులో కూడా యువత సామాజిక కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని గ్రామ అభివృద్ధికి సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బోధన్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ చేపూరి కిషోర్, వార్డు సభ్యులు వెల్మల మురళి, క్రాంతి కుమార్, ఆనంద్, ఆకారం సాయిలు, మాజీ ఎంపీటీసీ మంద సంజీవ్, యువకులు వీరవత్ని రాజు, గుడాల అజయ్, సుజిత్, రాజాలింగం తదితరులు పాల్గొన్నారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మంచినేనిపేట గ్రామంలో 23 క్వింటాల రేషన్ బియ్యాన్ని పట్టుకున్న జూలూరుపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీలక్ష్మి

భద్రాద్రి కొత్తగూడెం . మార్చ్ 06 . (జన సంఘర్షణ )



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం, మాచినేనిపేట గ్రామానికి చెందిన ఘనప నరసింహారావు, జూలూరుపాడు చెందిన కోమ్మినేని నాగేశ్వరరావు, గత కొంత కాలం నుండి జూలూరుపాడు మండల పరిసర ప్రాంత లబ్ధిదారుల వద్ద నుండి తెలంగాణ రాష్ట్రం ప్రవేశపెట్టిన ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా చేయబడుతున్న రేషన్ బియ్యాన్ని తక్కువ రేటుకు కొనుగోలు చేసుకుని, మాచినపేట గ్రామ శివారుణ గల నరసింహారావు కోళ్ల ఫారం అక్రమంగా నిలువ చేసుకొని, వాటిని అవసరమైన వారికి అమ్మి, ఎక్కువ మొత్తంలో లాభాలు గడిస్తున్నారు. ఎక్కువ మొత్తంలో రేషన్ బియ్యాన్ని కోళ్ల ఫారం దంపు చేసుకుని ఉన్నారనే సమాచారంపై , జూలూరుపాడు సిఐ శ్రీలక్ష్మి సిబ్బందితో కలిసి, కోళ్ల ఫారం వద్దకు వెళ్లి 23 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని, బజాజ్ ప్లాటినా ద్విచక్ర వాహనమును, ఒప్పో కంపెనీ సెల్ ఫోన్ ను స్వాధీనపరచుకున్నారు. 23 క్వింటాళ్ల రేషన్ బియ్యం విలువ 51 వేల రూపాయలుగా ఉంటుంది. ఇరువురిపై కేసు నమోదు చేయడం జరిగినది. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

## భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ అత్యవసర సమావేశం

భద్రాద్రి కొత్తగూడెం (జన సంఘర్షణ)



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోట దేవి ప్రసన్న ఆధ్వర్యంలో, వారి అధ్యక్షతన కొత్తగూడెంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లాలోని అన్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, పట్టణ కమిటీ అధ్యక్షులు హాజరై పార్టీ బలోపేతం, ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, రాబోయే కార్యక్రమాలు మరియు ప్రజా సమస్యలపై విస్తృతంగా చర్చించారు. జిల్లా అధ్యక్షులు తోట దేవి ప్రసన్న మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాలను గ్రామ స్థాయి నుంచి మరింత బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రతి మండలం, పట్టణ కమిటీలు సమన్వయంతో పని చేసి పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. అలాగే ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో పార్టీ నాయకులు ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, మండల అధ్యక్షులు, పట్టణ కమిటీ అధ్యక్షులు, పలువురు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో చైతన్యం కోసం రామగుండం పోలీసుల చైల్డ్ సేఫ్టీ, యాంటీ డ్రగ్స్ కార్యక్రమాలు

రామగుండం . మార్చ్ 06 . ( జన సంఘర్షణ )




రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి, మంచిర్యాల జోన్ పరిధిలో పిల్లల భద్రత, సంరక్షణతో పాటు మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో చైల్డ్ సేఫ్టీ, ప్రొటెక్షన్ , యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమాలను పోలీస్ అధికారులు ఈ రోజు నిర్వహించారు. సమాజంలో చిన్నారులపై జరుగుతున్న వివిధ రకాల నేరాలు, వేధింపులు, అలాగే యువతలో పెరుగుతున్న మాదకద్రవ్యాల వినియోగం నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. అధికారులు మాట్లాడుతూ పిల్లల భద్రత , మాదకద్రవ్యాల నియంత్రణ సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజలకు చిన్నారుల భద్రతకు సంబంధించిన ముఖ్యమైన సూచనలు తెలియజేశారు. పిల్లలు ఎలాంటి ప్రమాద పరిస్థితులను ఎదుర్కొన్నప్పుడు ఎలా స్పందించాలి, అపరిచిత వ్యక్తుల నుండి ఎలా జాగ్రత్త పడాలి, ఆన్‌లైన్‌లో ఎదురయ్యే మోసాలు మరియు సైబర్ ప్రమాదాల నుండి ఎలా రక్షించుకోవాలి అనే అంశాలపై వివరంగా అవగాహన కల్పించారు. అదే విధంగా యువతలో పెరుగుతున్న మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, కుటుంబ, సామాజిక సమస్యల గురించి వివరించారు. డ్రగ్స్ వినియోగం వల్ల వ్యక్తిగత జీవితంతో పాటు సమాజానికి కలిగే నష్టాన్ని కూడా వివరించారు. మాదకద్రవ్యాల బారిన పడకుండా యువత తమ లక్ష్యాలపై దృష్టి పెట్టి ఆరోగ్యకరమైన జీవనశైలిని అవలంబించాలని సూచించారు. పిల్లల భద్రత కోసం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు , సమాజం కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. చిన్నారులపై ఏవైనా అనుమానాస్పద సంఘటనలు గమనించినప్పుడు వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. అలాగే మాదకద్రవ్యాల విక్రయం లేదా వినియోగం గురించి సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసిన తూము వినయ్ కుమార్


హైదరాబాద్, మార్చి 06 (జన సంఘర్షణ):



రంజాన్ మాసం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఓబిసి వర్కింగ్ చైర్మన్ తూము వినయ్ కుమార్ మూసాపేట్ లోని వారి కార్యాలయం నందు శుక్రవారం రోజు రాత్రి ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర బీసీ నాయకులు జర్నలిస్టు తెల్ల హరికృష్ణ, గంధం రాజు, వెంకటేష్ యాదవ్, అవినాష్, టింకు, శ్రీకాంత్, శేఖర్, అక్బర్, నయీమ్, జాకీర్, సచిన్, అనిల్ చారి, నందగోపాల్, డిల్లా రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా తెల్ల హరికృష్ణ మాట్లాడుతూ ముస్లిం సోదరులకు శు భాకాంక్షలు తెలియజేశారు. మన దేశంలో పండుగలు మతసామరస్యానికి ప్రతీకలుగా నిలుస్తాయని కొనియాడారు, భారతదేశంలో అన్ని మతాలవారు ఏ పండుగ అయిన అందరూ కలిసిమెలిసి మెలిసి ప్రేమ ఆప్యాయతో జరుపుకుంటారని తెలియజేశారు.

# అసెంబ్లీ సీట్లు పెరిగితే మహబూబాబాద్ జిల్లా కొత్త నియోజకవర్గాల జోరు

**భద్రాద్రి కొత్తగూడెం ఇల్లెందు ప్రతినిధి: ( జన సంఘర్షణ)**
తెలంగాణలో అసెంబ్లీ స్థానాల పెంపుపై చర్చలు జరుగుతున్న నేపథ్యంలో మహబూబాబాద్ జిల్లాలో కూడా కొత్త నియోజకవర్గాల ఏర్పాటుపై ఆసక్తి పెరుగుతోంది. ప్రస్తుతం తెలంగాణలో 119 అసెంబ్లీ సీట్లు ఉండగా, ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2014 ప్రకారం వాటిని 153కు పెంచే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. సీట్లు పెరిగితే ప్రతి జిల్లాలో సగటున ఒకటి లేదా రెండు కొత్త నియోజకవర్గాలు ఏర్పడే అవకాశముందని విశ్లేషకులు చెబుతున్నారు. ప్రస్తుతం మహబూబాబాద్ జిల్లాలో పూర్తిగా ఉన్న అసెంబ్లీ నియోజకవర్గాలు మహబూబాబాద్, డోర్నకల్ మాత్రమే. మిగతా మండలాలు ఇతర నియోజకవర్గాల్లో విస్తరించి ఉన్నాయి. ఒకప్పుడు 15 మండలాలతో ఉన్న ఈ జిల్లా ప్రస్తుతం 18 మండలాలకు విస్తరించింది. మహబూబాబాద్, కేసముద్రం, ఇనుగుర్తి, డోర్నకల్, సిరోల్, కురవి, మరిపెడ, చిన్నగూడూరు, నర్సింహులపేట, నెల్లికుదురు, తొర్రూర్, పెద్దవంగర, దంతాలపల్లి, గూడూరు, కొత్తగూడ, గంగారం, గార్ల, బయ్యారం వంటి మండలాలు ఈ జిల్లాలో ఉన్నాయి. జిల్లా భౌగోళిక విస్తీర్ణం ఎక్కువగా ఉండటం, గిరిజన ప్రాంతాలు అధికంగా ఉండటం, గ్రామాల మధ్య దూరం ఎక్కువగా ఉండటం, జనాభా పెరుగుదల వంటి కారణాలతో భవిష్యత్తులో ఇక్కడ 3 నుంచి 4 నియోజకవర్గాలు ఉండే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా తొర్రూర్ కేంద్రంగా ఒక కొత్త నియోజకవర్గం ఏర్పడే అవకాశం ఉందని చర్చ జరుగుతోంది. అలాగే కొత్తగూడ, గూడూరు, బయ్యారం, గార్ల, గంగారం మండలాలతో మరో నియోజకవర్గం ఏర్పడే అవకాశాలు కూడా ఉన్నాయని చెప్పుకుంటున్నారు. నియోజకవర్గాల పునర్విభజన జరిగితే జిల్లాలో రాజకీయ సమీకరణాలు కూడా మారే అవకాశం ఉంది. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ, బీఆర్ఎస్, భారతీయ జనతా పార్టీ వంటి ప్రధాన రాజకీయ పార్టీలు భవిష్యత్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని తమ పార్టీ బలోపేతంపై దృష్టి సారిస్తున్నాయి. కమ్యూనిస్టు పార్టీలకు కూడా మానుకోట ప్రాంతం పోరాటాల పుట్టినిల్లు కావడంతో కొత్త రాజకీయ అవకాశాలపై అవి కూడా కన్నేసి ఉన్నాయి. నియోజకవర్గాల పెంపు జరిగితే కొత్త రాజకీయ నాయకులు ఎదిగే అవకాశాలు కూడా పెరుగుతాయి. ముఖ్యంగా బీసీ , గిరిజన వర్గాలకు రాజకీయంగా మరింత అవకాశాలు లభించే పరిస్థితి ఏర్పడుతుందని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.




# షార్ట్ సర్క్యూట్‌తో లారీలో గడ్డి దగ్ధం

◆ **తప్పిన భారీ ప్రమాదం**

**సోమల, మార్చి 6 ( జన సంఘర్షణ):**
మండల పరిధిలోని కందూరు పోస్టాఫీస్ సమీపంలో శుక్రవారం విద్యుత్ తీగలు షార్ట్ సర్క్యూట్ కావడంతో లారీలో తరలిస్తున్న గడ్డి అగ్నికి ఆహుతైన ఘటన కలకలం రేపింది. అప్రమత్తతతో వెంటనే చర్యలు తీసుకోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. స్థానికుల వివరాల ప్రకారం, ఆర్లగడ్డ గ్రామానికి చెందిన గోవర్ధన్ అనే వ్యాపారస్తుడు రైతులకు విక్రయించేందుకు లారీలో గడ్డిని లోడ్ చేసి సోమల వైపు తీసుకువస్తున్నాడు. ఈ సమయంలో కందూరు పోస్టాఫీస్ సమీపంలో రహదారి పైనుగా వెళ్లే విద్యుత్ తీగలు చాలా తక్కువ ఎత్తులో ఉండడంతో అవి లారీలో ఉన్న గడ్డిని తాకాయి. దీంతో విద్యుత్ తీగల్లో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. లారీలో ఉన్న గడ్డి వెంటనే మంటలు పట్టి వేగంగా వ్యాపించడంతో అక్కడి ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. పరిస్థితిని గమనించిన డ్రైవర్, స్థానికులు, స్థానిక నాయకులు వెంటనే అప్రమత్తమై లారీలోని గడ్డిని సమీపంలోని బచ్చేనాయిని చెరువులో దించివేశారు. అనంతరం జేసీబీ సహాయంతో గడ్డిని చెరువులోకి నెట్టివేసి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. సమయానికి స్పందించడంతో లారీ డ్రైవర్ సహా ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు. లారీ కూడా పెద్దగా దెబ్బతినకుండా తప్పించుకుంది. అయితే లారీలో ఉన్న గడ్డి పూర్తిగా దగ్ధమై వ్యాపారస్తుడికి ఆర్థిక నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రహదారిపై ఉన్న విద్యుత్ తీగలు చాలా తక్కువ ఎత్తులో ఉండడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని వారు వాపోతున్నారు. ఈ రహదారి గుండ ఆర్టీసీ బస్సులు, లారీలు, ట్రాక్టర్లు వంటి అనేక రకాల వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో ఇలాంటి ప్రమాదాలు మరలా జరగకుండా సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి తీగలను ఎత్తుగా అమర్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న స్థానిక ట్రాన్స్కో అధికారులు లైన్ ఇన్స్పెక్టర్ సుబ్బారెడ్డి, లైన్ మాన్ సుబ్రహ్మణ్యం పరిస్థితిని పరిశీలించారు. తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. రెండు రోజుల లోపల శాశ్వత పరిష్కారం చూపుతామని తెలియజేశారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు ఎక్కడ పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



# అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలలో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఓపెన్ హౌస్ కార్యక్రమం ఏర్పాటు....

**నంద్యాల మార్చి 6 ( జన సంఘర్షణ):**
అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలు 2026 లో భాగంగా ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఉత్తర్వులతో నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాలమేరకు నేడు జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ చీ.యుగంధర్ బాబు ఆధ్వర్యంలో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నంద్యాల పట్టణంలోని గురురాజా, భాష్యం, నలంద, చైతన్య మొదలగు స్కూల్ విద్యార్థులను ఆహ్వానించి వారికి పోలీస్ వారు ప్రతిరోజు వారి విధులలో భాగంగా ఉపయోగించే ఆయుధాలను వాటి పనితీరు గురించి విద్యార్థులకు సవివరంగా వివరించడం జరిగింది. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ యుగంధర్ బాబు మాట్లాడుతూ 2026 అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలలో భాగంగా నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో ఓపెన్ హౌస్ (ఆయుధాల ప్రదర్శన) కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో భాగంగా మహిళలు, చిన్నపిల్లలపై జరిగే అఘాయిత్యాలు, కొత్త చట్టాలు ముఖ్యంగా ఫోక్సో చట్టాలపై అవగాహన కల్పించడంతో పాటు మాదకద్రవ్యాల దుర్వినియోగం వాటిని వినియోగించడం వలన కలిగే దుష్ప్రభావాలపై విద్యార్థినిలకు అవగాహన కల్పించడం జరిగింది. నంద్యాల జిల్లా వ్యాప్తంగా అన్ని స్కూళ్లను, కళాశాలను శక్తి టీం బృందాలు సందర్శించి శక్తి యాప్ పై అవగాహన కల్పించడంతో పాటు శక్తి యాప్ యొక్క ప్రాముఖ్యత, ప్రయోజనాల గురించి, సమాజంలో మహిళలు చిన్నపిల్లలపై జరిగే అఘాయిత్యాలపై అప్రమత్తంగా ఉండాలని, సైబర్ క్రైమ్ నేరాలు,బాల్యవివాహాలు, రోడ్డు ప్రమాదాలు, ఫోక్సో చట్టాలు, కొత్త చట్టాలపై మరియు మహిళల భద్రత, మహిళా సాధికారతపై విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగింది. సైబర్ క్రైమ్ నేరాలపై సంబంధిత అధికారులు వారి సిబ్బంది సహాయంతో విద్యార్థులకు ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న సైబర్ క్రైమ్ నేరాలు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించడంతో పాటు ఎవరైనా సైబర్ క్రైమ్ నేరగాళ్ల చేతిలో మోసపోతే వెంటనే 1930 నెంబర్ కు కాల్ చేసి తక్షణ సహాయం పొందవచ్చునని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ, మహిళ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ జయరాం, రిజర్వ్ ఇన్స్పెక్టర్ మంజునాథ్, ఉమామహేశ్వర్ రెడ్డి, శ్రీనివాసులు, సిబ్బంది, మహిళా పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.





## ఘనంగా శ్రీ మరగదాంబ సమేత మార్గసహేశ్వరస్వామి కల్యాణోత్సవం



**బైరెడ్డిపల్లి మార్చి 6 ( జన సంఘర్షణ):**
బైరెడ్డిపల్లి మండలం లోని నెల్లిపట్ల లో వెలసిన శ్రీ మరగదాంబ సమేత మార్గసహేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవరోజు స్వామి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం స్వామికి అభిషేకం చేపట్టి విశేషపూజలు కొనసాగింది. అనంతరం స్వామి ,అమ్మవారి ఉత్సమూర్తులను పట్టు వస్త్రాలు ,వివిధ ఆభరణాలు, రంగురంగుల పూలతో అలంకరించి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఆతరువాత స్నాపన తిరుమంజనం నిర్వహించి అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కళ్యాణ వేదికపై శ్రీ మరగదాంబ దేవి సమేత మార్గసహేశ్వరస్వా వారిని కొలువు తీర్చారు. అనంతరం పుణ్యాహవాచనం వాస్తు పూజ కంకణ పూజ కంకణ ధారణ చేసి సంకల్పం చేశారు అనంతరం రక్షాబంధన మాంగల్య పూజ చేసి జీలకర్ర బెల్లం సమర్పణ చేసి మాంగల్య ధారణ చేశారు. ఆపై మాల మార్పిడి చేసి తలంబ్రాలు సమర్పించారు. అనంతరం మహా మంగళ హారతులను ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమం నిర్వాహకులుగా గోపతి బలిజ కులస్తులు, ఇతరులు కొనసాగారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

## కొళాయి పన్ను కడితేనే తాగునీరు..

◆ **ఎస్టీలపై మొండిగా వ్యవహరిస్తున్న కమిషనర్**

**శ్రీకాళహస్తి మార్చి 6 ( జన సంఘర్షణ):**
పట్టణంలో ఉన్న చెంచులక్ష్మి కాలనీలో శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ నిజాంసాహెబ్ పరిపాలనలాగా వ్యవహరిస్తూ ఎస్టీలపై తన అనుచరులతో ఎస్.కె సద్దాం బిల్ కలెక్టర్, సచివాలయం స్టాఫ్ తో వచ్చి చెంచులక్ష్మి కాలనీ యానాదులపై బీభత్సం సృష్టిస్తూ కొళాయిలు, కరెంటు పెరికేస్తా అని బెదిరిస్తూ నిజాం పరిపాలననే మరిపిస్తున్నారు. రెక్కాడితే కానీ డొక్కాడని ఎస్టీలు పై కమిషనర్ మొండిగా వ్యవహరిస్తున్నారు. పట్టణంలో ఎంతోమంది పెద్దపెద్ద బిల్డింగులు కట్టుకొని పన్ను ఎగ్గొట్టి లక్షల్లో బకాయిలు ఉండగా బలిసిన వారిని విడిచిపెట్టి బక్క పీనుగుల లాంటి ఎస్టీలను పీకులాడుతున్నారు. రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు పన్నులో మినహాయింపు ఇవ్వాలి. అది కాదని వడ్డీ చక్ర వడ్డీ భూ చక్ర వడ్డీలతో పన్నుమీద పన్నువేసి పేదలని ఒకేసారి కట్టమంటే వాళ్ళు ఎలా తెచ్చి కడతారు. ఈ యొక్క సిస్టం ఎలా ఉందంటే అగ్నిదేవుడికి ఆకలి వేసినప్పుడు అడవులు తినలేక పేదవారి గుడిసెలను కాల్చుకుతిన్నట్టు ఉంది. పై విషయమై శ్రీ కాళహస్తి నియోజకవర్గం లోని ఎస్సీ, ఎస్టీలు అందరూ కూడా కలిసి ఎస్సీ ఎస్టీ హ్యూమన్ రైట్స్ హరిజన గిరిజన మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేస్తూ కలెక్టర్ ని కూడా కలవనున్నారు. పై విషయమై ఇప్పటికైనా తెలుసుకొని ఉద్యోగస్తులు కమిషనర్ కూడా క్రమబద్ధీకరణ చేయకపోతే సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జికి ఫిర్యాదు చేయవలసి వస్తుంది. శ్రీకాళహస్తి నియోజకవర్గం అర్బన్ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ కలిసి పై విషయమై హెచ్చరించడం జరిగినదిని శ్రీకాళహస్తి నియోజకవర్గం ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీల ఐక్యవేదిక సభ్యులు తెలియజేశారు.

## రెయిన్‌బో స్కూల్‌లో ఘనంగా సైన్ వీక్ కార్యక్రమం







**రేణిగుంట మార్చి 6 ( జన సంఘర్షణ):**
రేణిగుంట లోని రెయిన్‌బో స్కూల్‌లో నిర్వహించిన సైన్స్ వీక్ కార్యక్రమం శుక్రవారం ఘనంగా ముగిసింది. సాధారణంగా కళాశాల స్థాయిలో నిర్వహించే సెమినార్ విధానంలో సైన్స్ ప్రాజెక్ట్ ప్రజెంటేషన్లు ఈ విద్యా సంస్థ ప్రత్యేకంగా ప్రీబి ప్రైమరీ స్థాయి నుంచి అమలు చేయడం విశేషం. సైన్స్ వీక్ ముగింపు కార్యక్రమంలో జూనియర్ కేజీ , సీనియర్ కేజీ విద్యార్థులు తరగతిలో నేర్చుకున్న విషయాలను చిన్నచిన్న సైన్స్ ప్రాజెక్ట్ ల రూపంలో తమ తల్లిదండ్రుల ముందుకు తీసుకొచ్చి ప్రదర్శించారు. చిన్నారులు నీటి చక్రం, మొక్కల పెరుగుదల, రంగుల కలయిక, అయస్కాంతం వంటి పలు సులభమైన శాస్త్రీయ అంశాలను ఆసక్తిగా వివరించి అందరిని ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమాన్ని స్కూల్ చైర్మన్ పి. అతావుల్లా ఖాన్ మార్గదర్శకత్వంలో, ప్రిన్సిపాల్ షహర్ భాను ఆధ్వర్యంలో నిర్వహించారు. చిన్న వయసులోనే విద్యార్థుల్లో పరిశోధన దృక్పథం, ఆత్మవిశ్వాసం, ప్రజెంటేషన్ నైపుణ్యాలను పెంపొందించుటమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం అని వారు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను సమర్థంగా ప్రోత్సహించి, ప్రాజెక్ట్ లకు మార్గ నిర్దేశం చేసిన ఉపాధ్యాయులను స్కూల్ యాజమాన్యం అభినందించింది. అలాగే పిల్లలను ప్రోత్సహిస్తూ కార్యక్రమానికి హాజరైన పూర్తి సహకారం అందించిన తల్లిదండ్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమం చివరిలో చిన్నారుల ప్రతిభను చూసి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తూ, ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఎంతో ఉపయోగపడతాయని అభిప్రాయపడ్డారు.

## గురుకుల పాఠశాలకు దరఖాస్తు చేసుకోండి

**సదుం మార్చి 6 ( జన సంఘర్షణ):**
సదుం లోని మహాత్మా జ్యోతి బాపూలే బీసీ గురుకుల పాఠశాలలో విద్యార్థులు చేరేందుకు ఈనెల 12 వరకు సమయం ఉందని ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ జయసింహ నాయుడు తెలిపారు. గురుకుల పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రభుత్వం రెండు జతలు యూనిఫారం, దుప్పట్లు, జంఖానాలు, బూట్లు, నోటు పుస్తకాలు, టెక్స్ట్ పుస్తకాలు ఉచిత వసతి ఇస్తాయన్నారు. అదేవిధంగా ప్రతిరోజు పౌష్టికాహారం అందజేస్తామని చెప్పారు. దీంతోపాటు జూనియర్ కళాశాలలో ప్రవేశానికి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

# నూకంబికా అమ్మవారి ఆలయంలో పూజలో పాల్గొన్న మనాలి ఠాకూర్





**గోదావరిఖని, మార్చి 6 జన సంఘర్షణ**

రామగుండం శాసనసభ్యులు ఎం ఎస్ రాజ్ ఠాకూర్ సతీమణి మనాలి ఠాకూర్ అంతర్గాం మండలంలోని శ్రీ శ్రీ శ్రీ నూకంబికా అమ్మవారి ఆలయాన్ని దర్శించుకున్నారు. శంకష్ట షాదుర్థశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలలో వారు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు సంప్రదాయ పద్ధతిలో పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీర్వాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మనాలి ఠాకూర్ ఆలయంలో భక్తులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేసి ప్రాంత ప్రజలందరికీ సుఖసంతోషాలు కలగాలని కోరుకున్నారు. అనంతరం ఆలయ పరిసర ప్రాంతాలను పరిశీలించి భక్తులతో ముచ్చటించారు. అలాగే త్వరలో నిర్వహించనున్న శ్రీ నూకంబికా అమ్మవారి జాతర సందర్భంగా జరుగుతున్న ఏర్పాట్లను వారు పరిశీ లించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆలయ కమిటీ సభ్యులకు మరియు సంబంధిత అధికారులకు సూచించారు. జాతరకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున శుభ్రత, తాగునీరు,భద్రత వంటి ఏర్పాట్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు,ఆలయ కమిటీ సభ్యులు,మహిళలు,భక్తులు మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి...

**విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి...**

**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా....**







**జనగామ జిల్లా స్టాఫ్‌రిపోర్టర్, మార్చి 6 జన సంఘర్షణ :**

జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాల పరిసరాలు పరిశుభ్రం గా ఉండాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఉపాధ్యాయులను ఆదేశించారు. జిల్లాలోని బచ్చన్నపేట మండల కేంద్ర పరిధిలో గల కేజీబీవీ పాఠశాలను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శుక్రవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో గల కిచెన్ ను సందర్శించి... కూరగాయలు తాజా గా ఉన్నాయా లేదా అని అలాగే... వంట సరుకుల నాణ్యత ను , గుడ్లను నీటిలో వేసి వాటి నాణ్యతను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. పాఠశాలను ప్రతి రోజూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు గురించి ఎస్ఓను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా విద్యార్థులతో మాట్లాడుతూ.. ఉదయం అల్పాహారం ఏం పెట్టారు? ఎలా ఉంది? అని ఆరా తీశారు. మెనూ ప్రకారం విద్యార్థులకి పౌష్టికాహారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ గీత, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్టీపీ వాసనకు సచ్చిపోవాలా



**మేడ్చల్ - మార్చి 6 జన సంఘర్షణ :**

కీసర మండలం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ పరిధిలోని జవహర్ నగర్ డబుల్ బెడ్రూమ్ ఇండ్ల వద్ద ఉన్న ఎస్టీపీ (సివరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్) నుంచి వస్తున్న దుర్వాసనతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంవత్సరాలుగా ఎస్టీపీ నుంచి డ్రైనేజ్ నీటిని సక్రమంగా తొలగించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొన్ని నెల లుగా డ్రైనేజ్ నీరు ఇండ్లలోకి చేరుతుండడంతో ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భరించలేని దుర్వాసన కారణంగా చిన్నపిల్లలు, వృద్ధులు అనేక రకాల వ్యాధులకు గురవుతున్నారని వారు చెబుతున్నారు. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక శాసనసభ్యులు మల్లారెడ్డి, పార్లమెంట్ సభ్యులు రాజేందర్ స్పందించి తమ సమస్యను వెంటనే పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో రమేష్, బాలరాజు, రజిని, సుధాకర్, మమత, అనిత పి బాలరాజు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# పరీక్ష రాసే విద్యార్థుల భద్రత కోసం స్పెషల్ డ్రైవ్





**గోదావరిఖని, మార్చి 6 జన సంఘర్షణ**

రామగుండం ట్రాఫిక్ ఏసీబీ సిహెచ్. శ్రీనివాస్ ఆదేశానుసారం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ బి. రాజేశ్వరరావు ఆధ్వర్యంలో సబ్ ఇన్స్పెక్టర్ జి. హరి శేఖర్ సమక్షంలో శుక్రవారం పరీక్షలు రాసే విద్యార్థిని, విద్యార్థులు వెళ్లే వాహనాలను తనిఖీ చేయడం జరిగింది. ముఖ్యంగా వాహనం నడిపే బస్సు డ్రైవర్లు,ఆటో డ్రైవర్లను డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలను చేయగా దానిలో ఒక ఆటో తాగి బండి నడుపుతున్నట్టు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలో తేలడం జరిగింది. ఎస్సై ఆ వాహనంలో పరీక్షలకి వెళ్తున్న విద్యార్థులు ఉండడం వల్ల వారిని ఎస్ఐ స్వయంగా దించడం జరిగింది. విద్యార్థి తల్లిదండ్రులు ఎగ్జామ్ వెళ్లే విద్యార్థిని,విద్యార్థులు ఏ వాహనం ఎక్కుతున్నారు. ఆ వాహనం డ్రైవర్ ఎలా ఉన్నాడని జాగ్రత్తలు పాటించాలని తెలియజేశారు.

# అలియాబాద్ మున్సిపాలిటీలో "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం.



**జన సంఘర్షణ మార్చి 6:**

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అలియాబాద్ మున్సిపాలిటీలో శుక్రవారం చైర్మన్ కమటం శిరీష కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్లపై ఉన్న చెత్తను తొలగించి, పిచ్చి మొక్కలను నిర్మూ లించారు. చైర్మన్ శిరీష కృష్ణారెడ్డి మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రజలకు సూచించారు. పరిశుభ్రతపై అందరూ అవగాహనతో కలిసి పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాలతి మాధవరెడ్డి, కమి షనర్ చంద్రశేఖర్, కౌన్సిలర్లు వెంకటేష్, మౌనికబాబు. వనజ అశోక్ రెడ్డి దీప సాయి కృష్ణ సుధాకర్ రెడ్డి మౌనిక దినేష్ గణేష్ మున్సిపల్ సిబ్బంది శంకర్ తదితరులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# పీరజాదిగూడలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రతిష్టాపన మహోత్సవం ఘనంగా నిర్వహణ



**జన సంఘర్షణ**

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఉప్పల్ జోన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని పీరజాదిగూడ పి ఉ టి కాలనీలో శ్రీభూ, నీళా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి నూతన ఆలయ ప్రతిష్టాపన మహోత్సవం ఈరోజు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రెష్ యాదవ్ హాజరై స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వజ్రెష్ యాదవ్ను ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేవాలయాలు సమాజంలో ఆధ్యాత్మికతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీరజాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి, మాజీ మేయర్ అమర్ సింగ్, మాజీ డిప్యూటీ మేయర్ శివ కుమార్ గౌడ్, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా మాజీ గ్రంథాలయం ఛైర్మన్ దర్గా దయాకర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం అత్యంత కీలకం...

**ప్రజల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ...**

**స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి...**

**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ....**







**జనగామ జిల్లా స్టాఫ్ రిపోర్టర్, మార్చి జన సంఘర్షణ :**

ప్రజలకు మెరుగైన వైద్యం అందించి, జీవనప్రమాణాలు పెంపొందించేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో పని చేస్తుందని...స్టేషన్ ఘన్పూర్ శాసన సభ్యులు కడియం శ్రీహరి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా చేపట్టి న ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్య క్రమం లో భాగం గా...శుక్రవారం లింగాల ఘణ పురంలో ప్రాధమిక ఆరోగ్యం కేంద్రంలో వైద్య ఆరోగ్య , కుటుంబ సంక్షేమ శాఖ ఆద్వర్యంలో.. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. మల్లిఖార్జురావు ఆధ్యక్షతన ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ, డిసిపి రాజమహేంద్రనాయక్ ల తో కలిసి స్టేషన్ ఘనపూర్ శాసన సభ్యులు కడియం శ్రీహరి లాంఛనంగా ప్రారంభించారు.

**ఈ సందర్బంగా స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి మాట్లాడుతూ...**

కుటుంబంలోని మహిళలు ఆరోగ్యంతో ఉన్నట్లయితే , తమ భర్తతో పాటు కుటుంబం బాగుండి , వారి ఆర్థిక పరిస్థితి స్థిరంగా వుంటుందని పేర్కొన్నారు. జనగామ జిల్లాను ధాన్యం దిగుబడిలో, నీటి పారుదల రంగంలో, విద్య, వైద్యం తో పాటు ఉపాధి అవకాశాల్లో మరింత ముందుకు తీసుకుపోలని అన్నారు అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలకు చేరువ చేసేందుకు మరించి కృషి చేయాలని, తద్వారా ప్రజల యొక్క జీవన విధానాలు మార్పుకు దొహదపతుందని సూచించారు. అందుకు నా వంతు పూర్తి సహయ సహకారాలు అందిస్తానని ఆయన తెలి పారు.ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక 99 రోజులు పాటు చేపట్టడం ప్రజలకు శు భసూచకమని అన్నారు. పేద ప్రజలకు మెరుగైన పరిపాలన అందించడమే రాష్ట్ర ప్రభుత్వము ముఖ్య ఉద్దేశమని చెప్పారు. ఈ ఆ రోగ్య శిబి రంలో కంటి, దంత , గైనకాలజీ, ఆర్థో పెడిక్స్, పీడి యాట్రిక్స్, జనరల్ మెడిసిన్ విభాగాలకు చెందిన ప్రత్యేక వైద్య నిపుణులు పాల్గొంటున్నారని తెలిపారు. లాంటి శిభిరాలను ప్రజలందరు తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాలో ఆరోగ్య కేంద్రాలు మెరుగ్గా పనిచేస్తున్నయని...గ్రామస్థాయిలో కూడా ఇంకా బాగా పనిచేయాలన్నారు. ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం పట్ల అతంత్య ప్రాధాన్యత ఇస్తున్నందున స్వయం సహా య సంఘాల సభ్యలుకు, అలాగే మోడల్ పాఠశాలు, ఆశ్రమ పాఠశాలు, రెసిడెన్షియల్ పాఠశాలు, కస్తూరీభా పాఠశాలల్లో అందరికి స్కీనింగ్ పరీక్షలు నిర్వహించి, ప్రొఫైలింగ్ చేసి, డిజిటల్ డేటా ను నమోదు చేసి, వారికి మార్గనిర్దేశం చేసి, హెల్త్ కార్డులు ఇచ్చేందుకు ప్రణాళి కలు చేపట్టాలని కోరారు. అలాగే బిపి, ఘగర్, క్యాన్సర్ ఎముకల నోప్పుల వంటి వ్యాధుల గుర్తించేందుకు వైద్య పరీక్షలు చేపట్టి, అవసరమైన మందులు అందించాల న్నారు. ఇందుకు ఆశావర్కర్లు, ఎఎన్ఎంలు కీలక పాత్ర పోషించాలన్నారు స్టేషన్ఘన్పూర్ నియోజకవర్గంలో 100 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను వేగవంతం చేసి... ఈ సంవత్సరంలో ప్రజలకు వైద్య సేవలు అంది స్తామన్నారు అలాగే స్టేషన్ ఘన్పూర్ నియోజకవర్గంలో మరో 3 ప్రైమరీ హెల్త్ కేంద్రాల ఉపయోగం ఎంత గానో ఉందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక 99 రోజులు కార్యక్రమాన్ని చేపట్టిందని, ఇందులో స్థానిక ప్రజాప్రతినిధులు భాగస్వాము చేస్తే మరింత మంచి ఫలితాలు సాధించుటకు అవకాశం ఉం టుందన్నారు, ప్రజలందరు ఈ కార్యక్రమాన్ని సద్వి నియోగం చేసుకోవానలి శాసన సభ్యులు కోరారు. ఈ సందర్బంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ మాట్లాడుతూ ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్య క్రమాల్లో తప్పని సరిగా స్థానిక ప్రజాప్రతినిధుల ను భాగ స్వాము చేయాలన్నారు. ఇందుకు మందుగానే వారికి షెడ్యూల్డ్ ను అందించాలన్నారు. ప్రజా పాలన –ప్రగతి ప్రణాళిక (99) రోజుల కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరు అదిక సంఖ్యలో పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవా లన్నారు. డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులకు వైద్యం కోసం వచ్చే పెషంట్లను అవసరమైన పరీక్షలు నిర్వహించాలన్నారు. స్థానికంగా వీలు కాని పక్షంలో పెద్ద ఆసుపత్రులకు రెఫరల్ చేయాలన్నారు, అలాగే రో జువారిగా నిర్ధేశించి లక్ష్యాలను సాధించుటకు ఆశావర్కర్లు స్థానికుల సహకారం తీసుకోవాలన్నారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్ర మాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. అంతకుముందు కార్యక్ర మాన్ని ప్రారంభించి.... అనంతరం ఆసుపత్రిలోని ప్రసూతి వార్డు, దంతపరీక్షల గది, జనరల్ వార్డు, డ్రగ్స్ మొయిన్ స్టోర్, చిన్న పిల్లల వార్డుల పరిసరాలను డిసిపి , జిల్లా కలెక్టర్ తో కలిసి శాసన సభ్యలు కలియ తిరిగి పరిశీలించారు. అలాగే పెషెంట్ల రిజిష్టర్ చేయు పద్దతి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి, గోపిరామ్, డిపిహెచ్ ఎస్, డా. నరేందర్ శర్మ, వ్యవసాయ మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ శివకుమార్, స్థానిక సర్పంచ్ లావణ్య, మండలంలోని సర్పంచులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, డాక్టర్లు, వైద్య సిబ్బంది, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# దౌల్తాబాద్ పీహెచ్సీలో ప్రత్యేక మెగా హెల్త్ క్యాంపు

**: ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి డాక్టర్ నాగరాజు.**



**దౌల్తాబాద్ మార్చి 6 జన సంఘర్షణ**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం దౌల్తాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక స్పెషలిస్ట్ మెగా హెల్త్ క్యాంపును నిర్వహించనున్నట్లు ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి డాక్టర్ నాగరాజ్ తెలిపారు.ఈ ఆరోగ్య శిబిరంలో జనరల్ ఫిజీషియన్, గైనకాలజిస్ట్, ఆర్థోపెడిక్స్ వైద్య నిపుణులు, పీడియాట్రిక్స్ (శిశు వైద్యులు), కంటి వైద్య నిపుణులు , దంత వైద్య నిపుణులు పాల్గొని రోగులకు ఉచిత వైద్య సేవలు అందించనున్నట్లు చెప్పారు.ఈ మెగా హెల్త్ క్యాంపు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించబడుతుందని, మండలంలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని ఆయన కోరారు.క్యాంపుకు హాజరయ్యే వారు తప్పనిసరిగా ఆధార్ కార్డు తీసుకుని రావాలని వైద్యాధికారులు సూచించారు.

# శ్రీశ్రీశ్రీ పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం మూడుచింతలపల్లిలో ఘనంగా నిర్వహణ

**మేడ్చల్ మార్చ్ 6**

మేడ్చల్ జిల్లా మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మూడుచింతలపల్లి గ్రామంలో స్థానిక ఆరాధ్య దేవి శ్రీశ్రీశ్రీ పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం ఘనంగా నిర్వహించబడింది. ప్రతి సంవత్సరం ఈ మహోత్సవం స్థానికుల జీవితంలో ప్రత్యేక స్థానాన్ని కలిగిస్తూ, గ్రామ సాంప్రదాయాలకు కొత్త ఉత్సాహాన్ని నింపుతుంది.ఈ ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్న మేడ్చల్ నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్, మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి మరియు మేడ్చల్ రూరల్ జిల్లా బిజెపి అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్, అమ్మవారి పూజలో ప్రత్యేక హాజరై, ఆరాధ్య దేవికి పూలమాలలు, దీపారాధన, మరియు తీర్థప్రసాదాలు సమర్పించారు.అమూల్యమైన ఈ సమారోహంలో స్థానిక ప్రజలు, సాంప్రదాయ కళాకారులు, మరియు విశేష అతిథులు పాల్గొని ఆధ్యాత్మిక వాతావరణాన్ని పంచుకున్నారు. ఏనుగు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ,"పెద్దమ్మ తల్లి ఆశీర్వాదంతో మేడ్చల్ నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషంగా, చల్లగా ఉండాలని కోరుకుంటున్నాం. ఇలాంటి సాంప్రదాయాలు మన సంస్కృతికి చల్లని శక్తి ఇస్తాయి" అని తెలిపారు.అంతేకాక, ఈ సందర్భంగా మూడుచింతలపల్లి మున్సిపాలిటీ నూతన చైర్మన్ జాము రవి మరియు స్థానిక కౌన్సిలర్లను శాలువాతో సన్మానించి, వారి విజయానికి శుభాకాంక్షలు తెలిపారు.




Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi. RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co